S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 74 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 28 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## తండ్రి అనారోగ్యంతో అప్పులపాలు

తల్లిదండ్రులను చంపి కుమారుల ఆత్మహత్య

మహారాష్ట్ర నాందేడ్‌లో విషాద ఘటన

ఇద్దరు కొడుకులు కలిసి నిద్రిస్తున్న తల్లిదండ్రులను హత్య చేశారు. ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి అనారోగ్యం వల్ల అప్పులపాలు కావడంతో వారిద్దరూ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

4



## వెచ్చదనం కోసం ఇంట్లో నిప్పుల కుంపటి

అర్ధరాత్రి వేళ విషవాయువులకు ముగ్గురు మృతి

చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

4



## నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక

మిడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది.

5

# ఏడాది తరువాత పోలీసుల చార్జ్‌షీట్

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో 23మందిపై అభియోగాలు..
- ఏ11గా నటుడు అల్లు అర్జున్

2



# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?



- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై బండి సంజయ్ ఆగ్రహం

3

## మహిళా కమిషన్ విచారణకు

# నటుడు శివాజీ

తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన నటుడు

కావాలనే కొందరు దుష్ప్రచారంపై ఆగ్రహం



2



జిల్లాల పునర్విభజనపై

# ప్రజాభిప్రాయానికి పెద్దపీట

## అభ్యంతరాల స్వీకరణ గడువు ముగింపు

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మంత్రులు, ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల పునర్విభజనపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

- నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం
- నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్
- మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు
- సీఎం చంద్రబాబు కీలక సూచనలు



అమరావతి : జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేశారు. జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పు చేర్పులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో

మిగతా 5 లో

## పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

- అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న సంస్థ
- గండిపేట ఒకప్పుడు రాజకీయ నేతల శిక్షణ కేంద్రం
- ఎన్టీఆర్ ట్రస్ట్ ఎడ్యేకుషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు

# చలి పంజా

తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి



**హైదరాబాద్, డిసెంబరు 27:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గత పదేళ్లలో ఎక్కువ రోజులు తీవ్రమైన చలి కమ్ముకున్నది ఈసారి శీతాకాలంలోనే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దాదాపు నెలరోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆరేడు డిగ్రీలకు పడిపోతు న్నాయి. హైదరాబాద్‌లోనూ ఈసారి చలి తీవ్ర త చాలా ఎక్కువగా ఉంది. ఇంట్లో వెచ్చగా, బ యట చలిగా ఉంటే.. ఆ తర్వాత ఇంట్లో చలి వేస్తోంది, బయటికెళితే మాత్రం కాస్త ఉపశమనం అనిపిస్తోంది. శీతల గాలులు, మన ఇళ్ల గోడలే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు.

మిగతా 2 లో



# జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

4

- కాంగ్రెస్ ఏదో గ్యారెంటీ ఇదేనా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కేటీఆర్

# పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం

4

- దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు
- ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు నష్టం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే



దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరవవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# ఏడాది తరువాత పోలీసుల చార్జ్‌షీట్

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో 23మందిపై అభియోగాలు..

## ఏ11గా నటుడు అల్లు అర్జున్

**హైదరాబాద్, డిసెంబర్ 27:** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏడాది తరవాత ఛార్జిషీట్ దాఖటు చేసి, మొత్తం 23 మందిపై అభియోగాలు మోపారు. ఛార్జిషీట్‌లో ఏ-11గా సినీ నటుడు అల్లు అర్జున్ పేరు చేర్చారు. 2024 డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి(35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారు. హుటాహుటిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతిచెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో నిమ్స్‌కు తరలించారు. పుష్ప-2 సినిమా చూసేందుకు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు రాగా.. తల్లి కుమారుడు తొక్కిసలాటలో చిక్కుకున్నారు. వారిలో తల్లి మృత్యువాతపడటం విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

# మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసు దర్యాప్తు

## పరారీలో నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్

**హైదరాబాద్, డిసెంబరు 27:** మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. మాసాబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో ఈ నెల 17న ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విని అరెస్టు చేశారు. వారిని విచారించగా అమన్‌ప్రీత్ పేరు బయటకు వచ్చింది. ఈ ఇద్దరు వ్యాపారుల నుంచి అతడు డ్రగ్స్ కొన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఇద్దరు వ్యాపారుల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకుంది. గతేడాది కూడా అమన్‌ప్రీత్ సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. మరోవైపు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వికి మరో నలుగురు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈకేసులో నిందితుడు ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నాడు. హీరోయిన్ సోదరుడి కోసం ఈగల్ టీం, మాసబ్ ట్యాంక్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విల అరెస్టుతో నటి సోదరుడు పేరు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. పట్టుబడ్డ ఇద్దరు వ్యాపారులకు నలుగురు రెగ్యులర్ కస్టమర్లు సప్లై చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు వ్యాపారవేత్తల నుంచి నటి సోదరుడు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు బయటపడింది. వ్యాపారవేత్తల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టాలీవుడ్, బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉన్న ప్రముఖ నటి సోదరుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా.. న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఈగల్ టీం హైదరాబాద్ వ్యాప్తంగా దృష్టి సారించింది. డ్రగ్స్ నివారణకు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల డిసెంబర్ 19న మాసబ్ ట్యాంక్ వద్ద ట్రూప్‌బజార్‌కు చెందిన ఇద్దరు వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు తరచుగా డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతని కోసం పోలీసులు వెతుకుతున్నారు. కాగా.. గత సంవత్సరం కూడా డ్రగ్స్ కేసులో సైబరాబాద్ పోలీసులకు నటి సోదరుడు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోసారి డ్రగ్స్ వ్యవహారంలో ఇరుక్కోవడం సంచలనంగా మారింది.

# ఐఏఎస్‌లకు కేంద్రం వార్నింగ్

## వివరాలు సమర్పించకపోతే చర్యలు

## కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, సీఎస్‌లకు ఆదేశాలు

**ఢిల్లీ, డిసెంబర్27:** నిర్దేశిత గడువు లోపల తమ ఆస్తుల వివరాలు(ఇమ్మూవబుల్ ప్రాపర్టీ రిటర్న్స్ ఉఐపీఆర్) సపర్పించకపోతే కఠిన చర్యలు తప్పవని ఐఏఎస్‌అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన ఆస్తుల వివరాలను తప్పనిసరిగా జనవరి 31, 2026లోపు స్పారో ఆన్‌లైన్ మాడ్యూల్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది. డిసెంబర్ 23, 2025న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం సమర్పించాలని, గడువు తర్వాత ఆన్‌లైన్ మాడ్యూల్ ఆటోమేటిక్‌గా మూసివేయబడుతుందని తెలిపింది. ఈ గడువులోగా వివరాలు సమర్పించని అధికారులకు విజిలెన్స్ క్లియరెన్స్ నిరాకరణ, ప్రమోషన్లు నిలిపివేయడం, క్రమశిక్షణ రాహిత్యం వంటి కఠిన చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. గతంలో ఆన్‌లైన్ ఫైలింగ్ పెరిగినప్పటికీ, ఇకపై గడువును కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన ఆల్‌ఇండియా సర్వీసెస్(కండక్ట్) రూల్స్, 1968 ప్రకారం అమలులో ఉందని, పారదర్శకత, అక్రమ సంపాదన నివారణకు ఇది కీలకమని డీఓపీటీ పేర్కొంది. అధికారులు తప్పనిసరిగా గడువులోగా ఆస్తుల వివరాలు సమర్పించాలని సూచించింది.

# సిద్దిపేట జిల్లాలో పులి సంచారం

## అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**సిద్దిపేట, డిసెంబరు 27:** సిద్దిపేట జిల్లాలో పులి సంచారంతో జనం బిక్కుబిక్కుమంటున్నారు. మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్, తొగుట మండలం వరదరాజుపల్లి, గోవర్ధనగిరి ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. పాద ముద్రల ఆధారంగా పులి సంచారాన్ని గమనించిన అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పులి సంచరిస్తున్న విషయం తెలియగానే ఈ ఊళ్లకు పక్కనే ఉన్న గోవర్ధనగిరి, ముత్యంపేట్, మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్ గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల ప్రజలకు పులి సంచారంపైన ఫారెస్ట్ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ.. నిన్న ఇక్కడ పులి కాలి ముద్రలు కనిపిస్తున్నాయని సమాచారం వచ్చిందని.. దీంతో సిద్దిపేట రెంజ్ సిబ్బంది, మా సిబ్బంది అనుమానస్పదమైన స్థలాన్ని వెతకడం జరిగింది. ఇది మన వరదరాజుపల్లి శివారులో ఒక పోలంలో అనుమానస్పదంగా పాదముద్రలు కనిపించాయి. నిన్న రాత్రి నుండి దర్యాప్తు చేయడం జరిగిందని.. దాని కదలికలు ఇక్కడే కనిపించాయని.. మేము మూడు టీంలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి నుంచి సిద్దిపేట మండలం తోర్నాల గ్రామం దిక్కు పోయినట్టు ఉందని అక్కడ కుడా పాద ముద్రలు కనిపిస్తున్నాయని తెలిపారు. పులితో అందరూ జాగ్రత్తగా ఉండాలని రైతులు పొలాల కాడికి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తమ జీవాలను సాయంకాలం తమవెంటే ఇంటికి తీసుకరావాలని ఆయన చెప్పారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి

మొదటి పేజీ తరువాయి

దీనితో ఇంట్లో చలివేస్తోంది. పై అంతస్తు, ఆపైన ఉండే వారికి శీతలగాలుల ప్రభావంతో మరింత ఎక్కువగా చలి ఉంటోంది. మరోవైపు ఆకాశంలో మేఘాలు లేకపోవడంతో, గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా దూసుకొస్తున్నాయి. సూర్యాస్తమయం వరకు ఈ ప్రభావం ఉంటోంది. తర్వాత మళ్లీ బయట చలిపెరుగుతోంది. ఇళ్లలో వెచ్చగా ఉంటోంది. హెచ్‌సీయూ, పటాన్‌చెరు, గచ్చిబౌలి, రాజేంద్రనగర్ వంటి శివారు ప్రాంతాల్లో 6-8 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.తెలంగాణలో జనవరి రెండో వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలు, ఆపైన నమోదవుతాయని వాతావరణ వివరాలు, ముందస్తు అంచనాలు అందించే 'స్కైమెట్ ' వెబ్‌సైట్ అంచనా వేసింది. మరో వాతావరణ వెబ్‌సైట్ ఆక్యువెదర్.. జనవరి తొలివారం తర్వాత చలి నుంచి ఉపశమనం ఉంటుందని, నెలాఖరుకల్లా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-19 మధ్యకు చేరుతాయని పేర్కొంది. ఈనెల 31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు కొనసాగుతాయని.. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరో 3-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణులంతా చెబుతున్నారు. సాధారణంగా 12 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కాంక్రీటు గోడలు, శ్లాబులు ఆ చల్లదనానికి పెద్దగా




ప్రభావితం కావు. అంతకన్నా ఎంత తగ్గుతూ పోతే.. అంతగా చల్లబడి, 'ప్రభావం అంతగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 8, 9 డిగ్రీలకు తగ్గిపోతే... గోడలు, శ్లాబు నుంచి తర్వాతి రోజంతా చల్లదనం వెలువడుతూనే ఉంటుంది. దానితో బయటికంటే ఇంట్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వానలు ఎక్కువగా కురవడం, ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. గత పదేళ్లలో అతి తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు, ఎక్కువ రోజులు కొనసాగడం ఈసారే చూస్తున్నాం. మరో 10 రోజుల వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం 15 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటోంది.

# ఆన్‌లైన్ గేమ్స్ బారిన మరో యువకుడు బలి

## డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య

**మేడ్చల్, డిసెంబరు 27:** జిల్లాలోని సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డ రవీందర్ (24) అనే యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన రవీందర్ అందులో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కారంటూ వీడియో రికార్డ్ చేశాడు. ఆపై రవీంద్ తన గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. గత కొద్దిరోజులుగా రవీందర్ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. నష్టాలు పూరించేందుకు స్నేహితులు, తెలిసిన వారి వద్ద నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని మరోసారి ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టాడు. అయితే ఎంత పెట్టుబడి పెట్టినా అతడికి లాభాలు రాకపోగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలోనే సూసైడ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు రవీందర్ ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయానని వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నానని, తనలా ఇంకెవరూ మోసపోవద్దంటూ స్నేహితులను కోరాడు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదంటూ వీడియో రికార్డ్ చేసిన అనంతరం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీందర్ ఆర్థిక సమస్యలతో



ఎక్కడెక్కడ అప్పులు చేశాడు, ఎంత మేరకు నష్టపోయాడు, సూసైడ్‌కు పూర్తి కారణాలు ఏంటి అనేదానిపై సూరారం పోలీసులు ఆరా తీస్తున్నారు.

# నిజామాబాద్‌లో రెచ్చిపోయిన దోపిడీ దొంగలు

## ఏటీఎంలను కట్ చేసి భారీగా నగదు దోపిడీ..

## రంగంలోకి దిగిన పోలీసులు..

**నిజామాబాద్, డిసెంబర్ 27:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దోపిడి దొంగలు రెచ్చిపోయారు. ముఖాలకు మాస్కులు ధరించి, చేతులకు గ్లౌజులు పెట్టుకొని ఏటీఎంలు లూటీ చేశారు. శనివారం తెల్లవారు జామున కారులో వచ్చిన దుండగులు.. గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎంలను కట్ చేసి అందులోని నగదు దోచుకుపోయారు. నగరంలోని ఆర్యనగర్, సాయినగర్ ఏటీఎంలలో భారీ చోరీ జరిగింది. ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో తెరిచి దుండగులు నగదు లూటీ చేశారు. సాయినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో సుమారు రూ.9 లక్షలు చోరీ చేశారు. ఆర్యనగర్‌లోని డీసీబీ ఏటీఎంలో దాదాపు రూ.30 లక్షలు ఎత్తుకెళ్లారు. గ్యాస్ కట్టర్ వాడినప్పుడు మరికొంత నగదు మంటల్లో కాలిపోయింది. ఐదుగురు సభ్యుల ముఠా దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. నిజామాబాద్ టౌన్ 4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగ్రా బ్రాంచ్‌కు సంబంధించిన డెవలప్‌మెంట్ క్రెడిట్ బ్యాంక్ ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగులు గ్యాస్ కట్టర్ సహాయంతో మెషిన్‌ను కట్ చేసి సుమారు రూ. 25 లక్షలు దోచుకున్నారు. అలాగే నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎంలోనూ చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఏటీఎం సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలపై స్ప్రే చేసి రికార్డు కాకుండా జాగ్రత్త పడ్డ దుండగులు.. దాదాపు 10 లక్షల వరకు దోచుకుపోయినట్లు తెలిసింది. ఈ రెండు ఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ, ఇన్‌చార్జి సీపీ ఎం.రాజేశ్ చంద్ర పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన అనంతరం.. రెండు బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోపిడీ జరిగిన ఏటీఎం లోపలి, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని సేకరించి, విశ్లేషించాలని ఇంచార్జి సీపీ



ఆదేశించారు. అలాగే క్లూస్ టీమ్, సాంకేతిక నిపుణులు, స్థానిక పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంల దోపిడీతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం నిఘా కట్టుదిట్టం చేశారు. జిల్లాలోకి వచ్చే, పోయే పాయింట్లలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

# మహిళా కమిషన్ విచారణకు నటుడు శివాజీ

## తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన నటుడు

## కావాలనే కొందరు దుష్ప్రచారంపై ఆగ్రహం

**హైదరాబాద్, డిసెంబరు 27:** నటుడు శివాజీ బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. హీరోయిన్స్‌ను ఉద్దేశించి శివాజీ చేసిన అభ్యంతర వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ వివరణ ఇవ్వాలని శివాజీకి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విచారణకు హాజరైన శివాజీ.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. శివాజీ స్టేట్‌మెంట్‌ను మహిళా కమిషన్ రికార్డ్ చేసుకుంది. ఇప్పటికే ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా శివాజీ క్షమాపణలు చెప్పారు. అనుకోకుండా మాటలు దొర్లాయని మహిళా కమిషన్ ముందు శివాజీ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని నటుడు చెప్పినట్లు సమాచారం. కాగా.. ఇటీవల దండోరా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్‌ల వస్త్రధారణను ఉద్దేశించి నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దానిపై సోషల్ మీడియాలో స్పందించిన శివాజీ.. తాను అన్న మాటలను వెనక్కి తీసుకుంటున్నాను.. క్షమించాలని కోరారు. అయినప్పటికీ మహిళా కమిషన్ మాత్రం.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందే అంటూ నటుడికి నోటీసులు ఇచ్చింది. దీంతో శివాజీ వ్యక్తిగతంగా విచారణకు హాజరై.. మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. అయితే తనకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని నటుడు శివాజీ అన్నారు. నేను ఏం తప్పు చేశానని నా మీద ఇంత కోపం. ఎవరు ఎలాంటి దుస్తులు వేసుకుంటే నాకేంటి? ఇంతకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా? వారి మీద ఇలానే మాట్లాడారా? నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయి. నాతో కెరీర్ మొదలు పెట్టిన వారికి నాపై కోపం ఉంది. నా వ్యాఖ్యల తర్వాత నన్ను ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకుని చర్చించారు. నాకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదు. సలహాలు ఇవ్వటం మానుకోవాలని నాకు అర్థమైందని శివాజీ అన్నారు.

# పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

## ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యుకేషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు

**హైదరాబాద్, డిసెంబరు 27:** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.



# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం



**హైదరాబాద్, డిసెంబరు 27:** రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా? అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ విషయంలో సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని అన్నారు. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

# పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ మాత్రమే..

- సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్
- పంచాయతీలకు మీ అబ్బ సొమ్ము ఇవ్వడం లేదు
- గ్రామాలను పడావు పెట్టిన ఘనత రేవంత్‌ది
- మళ్లీ కేసీఆర్ సీఎం కావాలన్నదే జనం మాట
- ఒక్క భాషలో తిడితే.. మూడు భాషల్లో తిడుతా
- మహబూబాబాద్ సర్పంచ్‌ల సభలో కేటీఆర్ ఎదురుదాడి



**మహబూబాబాద్, డిసెంబరు 27:** రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమేనని, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు మున్ముందు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కూడా అద్భుత ఫలితాలు సాధించాలని సూచించారు. మహబూబాబాద్‌లో సర్పంచ్‌లో సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలె, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలె' అన్నది మనందరి కోరిక, ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక అని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలే సెమీఫైనల్. ఆ తర్వాత 2028 అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ అన్నారు. ఈ అన్ని దశల్లో అద్భుత ఫలితాలు సాధిస్తూ ఫైనల్‌లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నదే మనందరి కోరిక. ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక. ఎందుకంటే పాడై పోయిన వ్యవసాయాన్ని బాగుచేసింది కేసీఆర్. రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్' అని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీలకు ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులు ఎవని అత్త సొమ్ము కాదని కేటీఆర్ అన్నారు. మీ పంచాయతీకి నిధులు ఇవ్వం అని బెదిరిస్తారని, ఆ నిధులు ఎవని అబ్బ సొత్తో, అత్త సొమ్మో కాదని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచి వచ్చిన సర్పంచ్ సోదరులారా.. ఇప్పుడు మీ మీద ఒత్తిడి ఉంటది. మీ ఎమ్మెల్యే మీకు నిధులు ఇయ్యనంటడు. మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇయ్యనంటడు. మిమ్మల్ని ఇబ్బంది పెడుతడు. కానీ నేను ఒక్కటే చెబుతున్నా.. మీమీ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి అబ్బ సొత్తో, ఎవరి అత్త సొమ్మో కాదు. అది ప్రభుత్వ సొమ్ము' అని చెప్పారు. గ్రామంలో మీదే పవర్. పంచాయతీకి వచ్చే నిధులను ఏ ఎమ్మెల్యే, ఏ ఎంపీ అడ్డుకోలేడు. అడ్డుకునే ప్రయత్నం చేసినా అది చెల్లదని తెలిపారు. 'రేవంత్‌రెడ్డీ.. నీకు నేను ఒక్కటే చెబుతున్నా. నీకు ఒక్క భాష మాత్రమే వచ్చు. నాకు 3 భాషలు వచ్చు. నువ్వు తిట్టాలనుకుంటే ఒక్కటే భాషల తిడుతవ్. నేను తలుచుకుంటే నిన్ను మూడు భాషలల్ల తిడుత ఏమనుకుంటున్నవో అని హెచ్చరించారు.. ఇక్కడున్న మా అక్కలను, అన్నలను అడిగి గోర్మాటి భాషల కూడా తిడుత. లంబాడ సోదరుల భాష నేర్చుకుని అండ్ల గూడా తిడుత అన్నారు.

## జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

**కాంగ్రెస్ ఏడో గ్యారెంటీ ఇదేనా**

**ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కెటిఆర్**

**హైదరాబాద్, డిసెంబరు 27:** ప్రజల గొంతుక అయిన జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిదర్శనమని.. ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన 7వ గ్యారంటీ ఇదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. జర్నలిస్టుల సమస్యలపై శాంతియుతంగా వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన జర్నలిస్ట్ నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం నేతల అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేనన్నారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా ప్రభుత్వం వారి ఉపాధిని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. మారుతి సాగర్, రమేశ్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, కడకంచి వెంకట్ వంటి కీలక నేతలను అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను, నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ, అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఇష్టానుసారంగా జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్

**రాజకీయ పార్టీల అభిప్రాయాలకు విలువలేదా : తలసాని**



**హైదరాబాద్, డిసెంబరు 27:** జిహెచ్‌ఎంసిలో డీలిమిటేషన్ పేరుతో ప్రభుత్వం, అధికారులు ఇష్టానుసారంగా డివిజన్లు ఏర్పాటు చేశారని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా, కౌన్సిల్ సమావేశాల్లో అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోలేదని విమర్శించారు. హడావుడిగా డివిజన్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటతీరు మార్చుకోవాలని, స్థాయికి తగినట్లు హుందాగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు. శనివారం సికింద్రాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో 19 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ (15), కళ్యాణ లక్ష్మి (4) ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా వాటిని ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారని పేదలు అడుగుతున్నారని వీటికి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, దీపికా, తహసీల్దార్ పాండు నాయక్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక రంగ అభివద్ధికి పెద్దపీట



**జగిత్యాల, డిసెంబరు 27:** రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివద్ధికి పెద్దపీట వేస్తోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పాడి రైతులకు అండగా నిలిచిందన్నారు. శనివారం నక్కలపేటలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో నట్టల నివారణకు ప్రభుత్వం రూ.4,43,70,974 ఖర్చు చేస్తుందన్నారు. వ్యాధులు తగ్గి జీవాల మరణాలు అదుపులో ఉంటాయన్నారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో పశుపోషకుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి, గొర్రెల పెంపకం చేపట్టాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

**దుందిబీ నదిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇసుకదోపిడీ**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**నాగర్ కర్నూల్ ,డిసెంబరు 27:** మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్, కరప్షన్ పాలన అని విమర్శలు చేశారు. శనివారం నాగర్ కర్నూలు జిల్లాలోజాగృతి జనం బాటలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. అభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా రావాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధనకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించినట్లుగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నల్ల మట్టి తీసేందుకు రైతుల వద్ద తీసుకున్న900 ఎకరాల భూమిని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో డిండి ప్రాజెక్ట్‌కి నీటిని తరలించలేదని.. ప్రభుత్వం మారిన కూడా ఇంకా సర్వేలే జరుగుతున్నాయని కవిత విమర్శించారు.

# జర్నలిస్టుల అక్రమ అరెస్టులు ఆపాలి

**వారిని వెంటనే విడుదల చేయాలి: హరీశ్ రావు**



**హైదరాబాద్, డిసెంబరు 27 :** రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్ట్‌ల న్యాయమైన పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. 'జీవో 252 సవరణను డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్న జర్నలిస్ట్‌లను అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం. స్తున్నాం. జర్నలిస్టులకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 26,000 అక్రిడిటేషన్ కార్డు లు ఇచ్చారు. రిపోర్టింగ్ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు అనే బేధం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారు కేసీఆర్. కానీ, రేవంత్ రెడ్డి అక్రిడిటేషన్ కార్డులను 10 వేలకు తగ్గిస్తామని చెప్పడం దుర్మార్గం. డెస్క్ జర్నలిస్ట్‌లకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. సోషల్ మీడియా, యూట్యూబ్ జర్నలిస్టులను టెర్రరిస్టులుగా పోల్చడం దారుణం. జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తిగా మద్దతు తెలుపుతుంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని ఎమ్మెల్యే వెల్లడించారు.

# నకిలీ గాంధీల మాటలు నమ్మరు

**గాంధీల పేరుతో ఎన్ని పథకాలు ఉన్నాయో చెప్పాలి**

**బంగ్లా హిందువుల ఊచకోతపై కాంగ్రెస్ ఎందుకు మాట్లాడదు**

**మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు విమర్శలు**



**హైదరాబాద్, డిసెంబరు 27:** దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ పేరు లేకుంటే నకిలీ గాంధీలకు మనుగడ ఉండదని భయపడుతున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీపై సోనియాగాంధీ కుటుంబానికి చిత్తశుద్ధి ఉంటే వారి హయంలో గాంధీ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాల శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 150 పథకాల్లో రెండు, మూడు పథకాలు మాత్రమే కాంగ్రెస్ గాంధీ పేరు పెట్టిందని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే హింసపై కాంగ్రెస్ కనీసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు రఘునందన్ రావు. 'తండ్రి ఈవీఎంలు ప్రవేశపెడితే కొడుకు దాన్ని వ్యతిరేకిస్తాడు. మీరు గెలిస్తే ఈవీఎంలు పని చేస్తున్నట్లా.. మేము గెలిస్తే పని చేయనట్లా?. ఇదెక్కడి సంస్కృతి ? రాహుల్ గాంధీకి తండ్రి అంటే గౌరవం, విశ్వాసం లేదు. ముక్కలైన కాంగ్రెస్.. దేశాన్ని ముక్కలుగా చేయాలని చూస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు , కంప్యూటర్ ఆపరేటర్‌లకు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇంకెవరికి పైసలు ఇవ్వదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రూపాయి అందడం లేదు. లోకల్ అడ్మినిస్ట్రేషన్ అనే పదానికి అర్థం లేకుండా కాంగ్రెస్ చేసింది. గతంలో కాంగ్రెస్ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. మల్లికార్జున ఖర్గే ముందు.. మీ సొంత రాష్ట్రంలో పంచాయతీ చూసుకోండి. అక్కడ రేపు ఎన్నికలు వస్తే ఏమవుతుందో అది చూసుకోండి' అని రఘునందన్ రావు విమర్శించారు.



సంపాదకీయం

# హిందువులు లక్ష్యంగా బంగ్లాలో దాడులు!

బంగ్లాదేశ్‌లో అల్లర్లు భారత్‌ను రెచ్చగొట్టేలా సాగుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే యూనస్ తాత్కాలిక నేతగా పగ్గాలు చేపట్టిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయి. హసీనాను పదవీచ్యుతి చేసిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే వందలమందిని హతమార్చారు. హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో కావాలనే అక్కడి మైనార్టీ హిందువులపై దాడులు విపరీతం అయ్యాయి. రాజకీయ హింసలో భాగంగా వీటిని చూపే ప్రయత్నం చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏడాదిగా అక్కడ జరుగుతున్న అల్లర్లు కేవలం హిందువులను ఊచకోత కోసేవిగా ఉన్నాయి. పనిగట్టుకుని మూకలు రెచ్చిపోతున్నా, తాత్కాలిక ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఇద్దరు హిందువులను హతమార్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై భారతదేశంలో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవు తున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. గాజాలో జరిగిన పరిణామాలను అయ్యో పాపం అనుకున్న భారతీయులు, పొరుగు దేశం బంగ్లదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మౌనం వీడాలంటూ సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ క్రమంలోనే హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆ దేశం రణరంగంగా మారిన సంగతి తెలిసిందే. అక్కడ ఇటీవల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తొలుత దీపుచంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించిన ఘటన మురువకముందే తాజాగా మరో వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన జరిగింది. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి రాజ్‌బరిలోని పంగ్షా ఉప జిల్లాలో హత్యకు గురయ్యాడు. సామ్రాట్ హత్య ఏ విధంగానూ మతపరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది కేవలం హత్యను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు. అయితే హిందువులపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైనారిటీ కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవల జరిగిన వరుస సంఘటనలను ఆందోళన కలిగించేవిగా అభివర్ణించింది. హిందువులపై ఇలాంటి హింసను విస్మరించలేమని భారత్ హెచ్చరించింది. సరిహద్దు వెంబడి జరుగుతున్న పరిణామాలను న్యూఢిల్లీ తీవ్రంగా పరిగణించిందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. హిందువులపై జరుగుతున్న హింసను విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బాధ్యులను గుర్తించి శిక్షిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల గురించి ప్రపంచమంతా గమనిస్తోంది. వాటిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ కూడా పేర్కొంది. శాంతిభద్రతల పరిస్థితి విషయానికొస్తే అక్కడ ఏం జరుగుతుందో ఎప్పటి కప్పుడు భారత్ తెలియజేస్తున్నది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు సహా మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగించే విషయమని జైస్వాల్ అన్నారు. మైమెన్‌సింగ్‌లో ఇటీవల జరిగిన హిందూ యువకుడి దారుణ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఆశిస్తున్నాం. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో హత్యలు, దహనాలు, భూ కబ్జాలతో సహా మైనారిటీలపై 2,900 కంటే ఎక్కువ హింసాత్మక సంఘటనలు జరిగినట్లు స్వతంత్ర వర్గాలు నమోదు చేశాయి. ఈ సంఘటనలను కేవలం రాజకీయ హింసగా తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందూ వ్యక్తులను కొట్టి చంపిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నిరసలు వస్తున్నా బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు ఆగడం లేదు. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హడీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హడీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ లపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు. దండెత్తి వచ్చేవారిపై సహృదయత చూపాల్సిన అవసరం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని భారత్ ఖండించింది. కిరాతకమైన దాడిలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడానికి కారకులైన దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక దాదాపు 2,900 హింసాత్మక ఘటనలు మైనారిటీలపై జరిగాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వీటిని రాజకీయ హింసగా కొట్టిపారేయలేమంది. పశ్చిమబెంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయంలో సీనియర్ అధికారులను కలిశారు. హిందూ మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐదులక్షల మంది సన్యాసులతో వచ్చి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని రెండుకోట్ల మంది హిందువుల్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటుంటే భారత్‌లోని వందకోట్ల మంది హిందువులు మౌన ప్రేక్షకులుగా కూర్చొంటారా అని ప్రశ్నించారు. మొత్తంగా బంగ్లను ఇలాగే వదిలేస్తే దారుణాలు పెరుగుతాయని గుర్తించాలి.



# పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం

- దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు
- ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు నష్టం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరువవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఖర్గే పలు కీలక అంశాలపై మాట్లాడారు. నరేగా రద్దును మహాత్మాగాంధీకి అవమానంగా, 'రైట్ టు వర్క్'పై మోదీ సర్కార్ క్రూర దాడిగా ఖర్గే అభివర్ణించారు. 'పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం.. పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని ఖర్గే విమర్శించారు. జఖం హయాంలో అమలైన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని ఖర్గే చెప్పుకొచ్చారు. ఎలాంటి అధ్యయనం లేకుండా రద్దు చేశారని మండిపడ్డారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల తరహాలో నేనని, రైతు ఉద్యమంలా దేశవ్యాప్త పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఓఉఔఖీఇఉంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సభ్యులకు ఖర్గే సూచించారు. కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని ఖర్గే తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని ఖర్గే చెప్పారు. 2026 ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని ఆయన ప్రకటించారు.

# నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

## వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** మీడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల



ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ పక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక పక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా భారత హెచ్-1బీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

## పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు

## కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.



# తండ్రి అనారోగ్యంతో అప్పులపాలు

## తల్లిదండ్రులను చంపి కుమారుల ఆత్మహత్య

**ముంబై, డిసెంబరు 27:** ఇద్దరు కొడుకులు కలసి నిద్రిస్తున్న తల్లిదండ్రులను హత్య చేశారు. ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి అనారోగ్యం వల్ల అప్పులపాలు కావడంతో వారిద్దరూ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 25న జవాలా మురార్ గ్రామానికి చెందిన 51 ఏళ్ల రమేష్ సోనాజీ లాఖే, 45 ఏళ్ల భార్య రాధాబాయి వారి ఇంట్లో మంచంపై మరణించడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. దంపతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రిస్తున్న ఆ భార్యాభర్తలను గొంతునొక్కి చంపినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. కాగా, అదే రోజున ఆ గ్రామానికి కొంత దూరంలోని రైలు పట్టాలపై ఆ దంపతుల కుమారులులైన 25 ఏళ్ల ఉమేష్, 23 ఏళ్ల బజరంగ్ మృతదేహాలు కనిపించాయి. దీంతో వారిద్దరి మృతదేహాలను కూడా పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అన్నాదమ్ములు రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు ఒకే రోజు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వేర్వేరుగా మరణించిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేశారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పక్షవాతంతో మంచానికి పరిమితమైన రమేష్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఆయనకు చికిత్స కోసం ఆ కుటుంబం అప్పులపాలైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్థిక బాధలు తట్టుకోలేక ఇద్దరు కుమారులు తమ తల్లిదండ్రులను చంపి ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు గ్రహించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# వెచ్చదనం కోసం ఇంట్లో నిప్పుల కుంపటి

## అర్ధరాత్రి వేళ విష వాయువులకు ముగ్గురు మృతి

**పాట్నా, డిసెంబరు 27:** చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారం రాత్రి వేళ గదిలో వెచ్చదనం కోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలుపులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మండటంతో ఆ గదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో నిద్రించిన ఎనిమిది మంది స్పృహ కోల్పోయారు. శుక్రవారం తెల్లవారుజామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకి వెళ్లి చూశారు. ఆ గదిలో ఉన్న వారి పరిస్థితి చూసి ఆందోళన చెందారు. మరోవైపు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మూడేళ్ల తేజాంష్ కుమార్, ఏడు నెలల గుడియా కుమారి, ఆదియా కుమారి, 70 ఏళ్ల కమలావతి దేవి అప్పటికే మరణినంచినట్లు డాక్టర్లు నిర్ధారించారు. 25 ఏళ్ల ఆర్య కుమారి, 24 ఏళ్ల ఆర్య సింగ్, 25 ఏళ్ల అనిషా, 35 ఏళ్ల అమిత్ అలియాస్ సోనుకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆ తర్వాత బొగ్గుల కుంపటి ఉంచిన గదిని పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందాన్ని పంపి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు శీతాకాలంలో మూసి ఉన్న బెడ్ రూముల్లో బ్రజియర్లు, హీటర్లు, బ్లోయర్‌లను ఉపయోగించవద్దని ఆ జిల్లా అధికారులు సూచించారు. నిద్రించే గదిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని కోరారు. తద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

# జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయానికి పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈరోజు సమావేశంలో 927 అభ్యంతరాలు, సూచనలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్, మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 31న తుది నోటిఫికేషన్‌ను ఏపీ సర్కార్ జారీ చేయనుంది. అయితే, జిల్లాల పునర్విభజనపై ప్రాథమిక నోటిఫికేషన్‌ను నవంబరు 27వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నెల రోజుల పాటు అభ్యంతారాలను స్వీకరించింది. అయితే శనివారంతో గడువు ముగుస్తోంది. ప్రాథమిక నోటిఫికేషన్

అనంతరం వ్యక్తమైన అభ్యంతరాలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా రాజంపేటను కడపలో కలిపి, రాయచోటిని మదనపల్లిలో కలిపే ప్రతిపాదనలపై ప్రభుత్వం కీలక సమాలోచనలు చేసింది. ఇప్పటికే ప్రకటించిన మూడు జిల్లాలతో 29 వరకు జిల్లాల సంఖ్య పెరగాల్సి ఉంది. తాజా ప్రతిపాదనలతో 28 జిల్లాలకే పరిమితం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



ఇప్పటికే ప్రత్యేక జిల్లాగా ప్రకటించిన రాయచోటిని మదనపల్లిలో కలిపే దిశగా సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే ప్రకటించిన 3జిల్లాలపై అభ్యంతరాలు, ప్రతిపాదనలపై సమీక్షించారు సీఎం. దొనకొండ, కురిచేడును మార్కాపురం జిల్లాలో.. పొదిలిని ఒంగోలు జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని చర్చించారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రైల్వే కోడూరును తిరుపతిలో కలిపే అంశంపై కసరత్తు చేశారు. (ఆదివారం) మరోసారి సమావేశమై ఎల్లుండి మంత్రివర్గం ముందుకు ప్రతిపాదనలు తీసుకురానుంది మంత్రివర్గ ఉపసంఘం. కేబినెట్ ఆమోదం తర్వాత ఈనెల 31వ తేదీన తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ సమీక్షకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, నారాయణ హాజరయ్యారు.

## మృతి చెందిన రామారావు కుటుంబానికి బాసట

### ఫోన్ చేసి పరామర్శించిన సీఎం చంద్రబాబు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం రాజధాని రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎన్-8 రహదారి విషయమై తుళ్లూరులో శుక్రవారం మందడం రైతులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సమయంలోనే గుండెపోటుతో కుప్పకూలారు రామారావు. ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. ఈ క్రమంలోనే సీఎం ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని రామారావు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి అండగా ఉండాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు సీఎం చంద్రబాబు సూచించారు.

## నేడు అయోధ్యకు సీఎం చంద్రబాబు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివార) షెడ్యూల్ బిజీ బిజీగా ఉండనుంది. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. అయోధ్య రామ జన్మభూమిలోని శ్రీ రాముడు దర్శనం చేసుకోనున్నారు. మూడు గంటల పాటు అయోధ్యలో శ్రీ రాముని సన్నిధానంలో ఉండనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం విదేశీ పర్యటనకు వెళ్లనుంది. ఈ నెల 30వ తేదీ ఉదయం విదేశాలకు సీఎం కుటుంబం బయలుదేరనుంది. తిరిగి జనవరి నాలుగో తేదీన రానున్నారు. వ్యక్తిగత పర్యటన కోసం సీఎం చంద్రబాబు విదేశాలకు వెళ్తున్నట్లు సమాచారం.

# పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

### అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న సంస్థ

### గండిపేట ఒకప్పుడు రాజకీయ నేతల శిక్షణ కేంద్రం

### ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యేకుషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు



**హైదరాబాద్ :** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.

# లంక, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

సమస్యలు ఉన్నాయని.. వాటిని ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు.గ్రామాల్లో అభివృద్ధి పనులను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రీ మెన్ కమిటీ నివారం సమీక్ష నిర్వహించింది. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందన్నారు. జరీబు భూములపై న్యాయంగా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని... వారి సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామన్నారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని... కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని కేంద్రమంత్రి అన్నారు. వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని.. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోమని



కోరారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమస్యలపై కూడా ఈ రివ్యూలో చర్చించినట్లు తెలిపారు. లార్జ్ రిటర్నబుల్ ఎ÷-లాట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. పరిష్కారం దిశగా వర్క్ చేస్తున్నామన్నారు. హెల్త్ కార్డ్స్, పెన్షన్లు తదితర అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. స్థానికంగా 1596 మందిని క్యాపిటల్ వర్క్స్‌లో అధికారులు జాయిన్ చేసుకున్నారని.. ఇవి కాకుండా మరో 10 వేల మందిని రాజధానిలో ఉండే స్థానికులను కలిపే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. రోడ్ల నిర్మాణలు, భారీ వాహనాల రాకపోకల వల్ల కొన్ని చోట్ల స్మశాన ప్రాంతాలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. మల్కాపురం, వెంకటాపురం గ్రామాల్లో స్మశానాలు లేవని... అలాగే మరికొన్ని ప్రాంతాల్లో బరెల గ్రౌండ్ ఏర్పాటు చేయాలని చెప్పామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు వేలకు పైగా పెన్షన్లను రిజెక్ట్ చేశారని.. ఎవరెవరికి పెన్షన్లు మిస్ అయ్యాయో వాటి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు. అమరావతిలో భూమి ఇచ్చిన వారికి బిలో పావర్టీ లైన్ తో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిన్న జరిగిన ఒక గ్రామ సభలో మాట్లాడుతూ ఉండగా రైతు రామారావు

అకస్మాత్తుగా మరణించడం జరిగిందన్నారు. ఆ రైతుకు ఐదు ఎకరాల భూమి ఉందని... సభలో కూడా రామారావు మాట్లాడుతూ తమకు అందించే భూమి ఎక్కడ వస్తుందో స్పష్టంగా చెప్పాలని అడిగారన్నారు. చాలా వివరంగా, ఆయన మామూలుగా మాట్లాడుతూ ఉండగా అనుకోకుండా జరిగిన ఘటనను కొన్ని పత్రికలు, వైసీపీ నాయకులు శవాల మీద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏమీ లేని చోట ఇలాంటి దుష్ప్రచారాన్ని చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రాభివృద్ధికి వైసీపీ ఆటంకం

మొదటి పేజీ తరువాయి



హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా అని ప్రశ్నించారు. నడిరోడ్లపై అకారణంగా మూగజీవాల ఉసురు తీసి బలులు, రక్తాభిషేకాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ సైకో మూక వికృత చేష్టలు చూస్తుంటే మానవత్వం ఉందా లేదా అనిపిస్తోందన్నారు. అధికారం కోల్పోయిన తరువాత కూడా రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైకాపా శ్రేణులు ఏం చేసినా.. ఆ పార్టీ నాయకుడు నోరు తెరిచి తప్పని చెప్పడం లేదన్నారు. రాజకీయాలను అడ్డం పెట్టుకొని రౌడీయిజం చేస్తున్నారు. జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా? రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లల్ని కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారు చేస్తున్నారని మండిపడ్డారు. టీనేజ్ పిల్లల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాలని అనిత సూచించారు. ఆస్తి గురించి సొంత తల్లి, చెల్లెలిపై కేసులు పెట్టిన వారు మీ పిల్లల్ని రక్షిస్తారా? పిల్లలు రోడ్డుపైకి వచ్చి.. నరుకుతాం.. చంపుతాం అంటున్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని జగన్ చెప్పలేరా అని నిలదీసారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా అని అనిత మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ మూకా ఎంతకైనా దిగజారుతోందని వ్యాఖ్యలు చేశారు. మూగ జీవాలను బలి తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వైసీపీ పార్టీ ఉన్మాదాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, కుప్పం, గోపాలపురం... ఇలా పలుచోట్ల మేక తలలు నరికి బహిరంగంగా నెత్తురు చల్లిన సంఘటనలు ఉన్నాయన్నారు. మీరు చేస్తున్నది తప్పు అని చెప్పిన గర్భిణీ స్త్రీ మీద వైసీపీ మూక ఉన్మాదుల మాదిరి దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణి మీద వైసీపీ సైకో దాడి జరిగితే ఈ రోజు వరకు జగన్మోహన్ రెడ్డి తప్పు అని ఖండించలేదన్నారు. గర్భిణీపై దాడి చేసిన కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని మరో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అతను జనసేన కార్యకర్త అయితే జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో ఎందుకు పాల్గొంటారని ప్రశ్నించారు.జగన్మోహన్ రెడ్డి రాజకీయ పబ్బం కోసం 20 ఏళ్ళ లోపు యువతని బలితీసుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్ర యువత భవితను నాశనం చేశారని.. ఇప్పుడు రప్పా రప్పా అంటూ వైసీపీ మూకా యువతను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రప్పా రప్పా అంటే జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు. కత్తి తీస్తే కటకటాలపాలవడం ఖాయమని వైసీపీ మూక గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఇది రాక్షసుడు నడిపే ఆటవిక వైసీపీ పాలన కాదని.. శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే చంద్రన్న నాయకత్వంలో నడిచే కూటమి ప్రభుత్వ పాలన అని అన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఎటువంటి హింసను సహించదని, ఉపేక్షించదని హోంమంత్రి అనిత తేల్చిచెప్పారు.

## ఆర్‌ఎస్‌ఎస్‌పై పోరాటం కొనసాగుతుంది




మొదటి పేజీ తరువాయి

సాంస్కృతికంగా ఆర్‌ఎస్‌ఎస్‌పై పోరాటం చేస్తానని పేర్కొన్నారు. భారతదేశంలో కనిపించని బ్రహ్మ రాక్షసుడు ఉన్నారని విమర్శించారు. కమలం పార్టీతో తాను పోరాడుతున్నానని.. తన పోరాటం ఆగదని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలోని ఏయూ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు ప్రకాశ్‌రాజ్. సీఐటీయూకి తనకు అనుబంధం చాలా ఏళ్ల నుంచి ఉందని గుర్తుచేసుకున్నారు. వీధి నాటకాల నుంచే తన ప్రయాణం ప్రారంభమైందని ప్రస్తావించారు. అబద్ధం మాట్లాడటానికి ధైర్యం ఉండాలని.. నిజం మాట్లాడటానికి కాదని చెప్పుకొచ్చారు. ఈరోజు రైతుల గుండెల మీద ఆయా ప్రభుత్వాలు బిజినెస్‌మెన్‌లను కూర్చొబెడు తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు అన్నదాతల కనీస సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈరోజు ప్రజల గొంతుగా మారి తాను మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు ప్రకాశ్‌రాజ్. మన ప్రభుత్వాలు అమ్ముడు పోయాయని ఆరోపణలు చేశారు. రాజకీయ నేతలు మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చమట చుక్కకు ఓటమి లేదని.. ప్రస్తుతం పేదల శ్రమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కోసం సీఐటీయూ గొంతెత్తి పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరం అవుతున్నాయని విమర్శించారు. విశాఖపట్నంలో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వాలు అమ్ముడు పోయాయని ప్రకాశ్‌రాజ్ విమర్శలు చేశారు.

## విజయవాడ, తిరుపతిలకు గ్రేటర్ హోదాకి బ్రేక్

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ఆంధప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ(శనివారం) ఏపీ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు మంత్రి నారాయణ. ఈ సమావేశంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. మరోసారి సమావేశమై గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ అంశాలపై కీలక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. జరీబు, నాన్ జరీబు భూములపై రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం భూములకు సంబంధించి కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. రాజధాని రైతులకు రిటర్నబుల్ ఎ÷-లాట్స్‌లో 42మంది మార్పులు కోరారని తెలిపారు. రిటర్నబుల్ ఎ÷-లాట్ మార్చుకోవాలనుకునే అన్నదాతలు దరఖాస్తు చేసుకుంటే వాటిని మారుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# కోట్ పల్లి ఆయకట్టు రైతులకు ప్రభుత్వం పంట సెలవు దినంగా ప్రకటించడం జరిగింది.

● వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, డిసెంబర్,27(సమయం న్యూస్) :** కోట్ పల్లి ఆయకట్టు రైతులకు ప్రభుత్వం పంట సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. 1967లో స్థాపించబడిన కోట్ పల్లి ప్రాజెక్టు సంవత్సరాలుగా చిన్న చిన్న మరమ్మత్తులు,నిర్మాణ పనులు గురైంది కానీ అప్పటినుండి ఆధునికరించబడలేదన్నారు. ఆధునీకరణ పనులకు కాంక్రీట్ సిమెంట్ లైనింగ్, గైడ్ వాల్స్ నిర్మాణం, నిర్మాణాల బలోపేతం అవసరం ఉందని ఆయన తెలిపారు. 2025-26 రబీ సీజన్ లో కుడి కాలువతో ప్రారంభించి, ప్రాజెక్టుకు ఆధునీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. కుడి కాలువలో 24 కిలో మీటర్ల పొడుగు ఆధు నీకరణ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఆధునీకరణ పనులు నిర్ణీత సమ యంలో పూర్తి చేసి కాలువ యొక్క నీటిపారుదల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి అదేవి ధంగా రైతు సమాజానికి దీర్ఘకాల ప్రయోజనం చేకూర్చేందుకు పనులు చేపట్టడం జరు గుతుందని ఆయన తెలిపారు.పనులు సులభతరంగా చేయడానికి కాలువలోకి నీటిని విడుదల చేయడం నిలిపివేయడం జరిగిందని ఆయన తెలిపారు. వరి సాగు కోసం ప్రధానంగా కాలువ నీటిపై ఆధారపడిన కుడి కాల్వ కింద ఉన్న ఆయకట్టు రైతులకు ప్రభుత్వం పంట సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, 2025-26 యాసంగి సీజన్ కోసం వరి పంట సాగును నిలిపివేలని రైతులను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభ్యర్థించారు.

# ఘనంగా షాబాద్ మాజీ జెడ్పిటిసి జన్మదిన వేడుకలు





**షాబాద్ మండలం, డిసెంబర్,27(సమయం న్యూస్) :** పట్నం అవినాష్ రెడ్డి పుట్టిన రోజు షాబాద్ లో వేలాది కార్యకర్తల మధ్యలో సాగింది. నాయకులు కార్యకర్తలు అవినాష్ రెడ్డి తో కెకులు కట్ చేయించారు. బొకేలు ఇచ్చి, పువ్వుల మాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు.మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి,దర్మన్న గారి వెంకట్ రెడ్డి,వీసీ మహేందర్ రెడ్డి, చల్లా శేఖర్ రెడ్డి, దారెడ్డి వెంకట్ రెడ్డి,పెద్దొళ్ళ ప్రభాకర్, షాబాద్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ రావు, మాజీ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్ గౌడ్, జడల రాజేందర్ గౌడ్ నరసింహారెడ్డి పొన్న,సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు,మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పిటిసిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పాల్గొన్నారు.షాబాద్, చేవెళ్ల, శంకర్పల్లి, మొయినాబాద్, షాద్ నగర్, పరిగి నాయకులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన నాయిని సందీప్!



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 27 :** బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ సమక్షంలో నూతన సంవత్సర క్యాలండర్ ను ఆవిష్కరించిన గజ్వేల్ పట్టణ బిజెపి నాయకులు నాయిని సందీప్ కుమార్. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 12వ వార్డులో అనేక కార్యక్రమాలు చేస్తూ స్థానిక ప్రజల కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీలకతీతంగా ఎల్లప్పుడూ ప్రజల శ్రేయస్సుకు ముందుకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎలక్షన్లలో భారతీయ జనతా పార్టీ అత్యధిక ఓట్లు మొట్టమొదటి సీటు గెలిచేది 12వ వార్డులోనే అని ధీమా వ్యక్తం చేశారు, దానికోసం గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేస్తున్నామని తెలియజేశారు. సంవత్సరం క్రితం జరిగిన లోకసభ ఎలక్షన్లలో గజ్వేల్ మున్సిపాలిటీలో ఇతర పార్టీలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన ప్రజలు బిజెపి వైపు ఉండి 550 పైచిలుకు ఓట్ల మెజారిటీని ఇచ్చారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, బిజెపి నాయకులు సీనియర్ ఎల్లు రామ్ రెడ్డి, ఉప్పల మధుసూదన్, పేర్ల శ్రీనివాస్, కుడిక్యాల రాములు, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి, బిజెపి సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, టెలికం బోర్డు మెంబర్ కమ్మరి శీను, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు మనోహర్ యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు బోస్ , రామచంద్ర చారి, ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్, మడుగురి నరసింహ ముదిరాజ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని: బహుజన జెఎసి డిమాండ్ నిరసన

**ఖమ్మం డిసెంబర్ 27 : ( సమయం న్యూస్ ) :** ఎస్సీ , ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని , ఎస్సీ , ఎస్టీ కమిషన్ ఆదేశాలను తూచ తప్పకుండా అమలు చేయాలని , ఎస్సీ , ఎస్టీ కేసుల్లో స్టేషన్ బెయిలు ఇవ్వటాన్ని ఉపసంహరించుకోవాలని , ఎస్సీ , ఎస్టీ చట్టం స్ఫూర్తిని కాపాడి , ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ ( తెలంగాణ ) ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ సెంటర్ లోని డాక్టర్ బి.ఆర్ . అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నినాదాలు చేస్తూ , ఫ్ల కార్డులను ప్రదర్శించారు. అనంతరం లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బానోతు బద్రు నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ గుంతేటి వీరభద్రం , అడ్వకేట్ నేరెళ్ల శ్రీనివాస్ , కో బి కన్వీనర్ నకరికంటే సంజీవరావు , వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి , అడ్వకేట్ షేక్. నజీమా లు మాట్లాడుతూ పై డిమాండ్లతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మళ్లించకుండా గూడే లను, తండాలను అభివృద్ధి చేయాలని , ఈ నిధులను సకాలంలో ఖర్చు పెట్టాలని , లేని పక్షంలో అభివృద్ధి కుంటు పడటమే కాకుండా మంజూరు చేసిన కొట్లాది రూపాయల నిధులు మరిగిపోతాయని అన్నారు. జిల్లా కేంద్రమైన ఖమ్మం నగరంలో గల అంబేద్కర్ భవనం శిథిలావస్థచేరుకుందని , దీనిని తొలగించి అధునాతన భవన నిర్మాణం చేపట్టాలని



డిమాండ్ చేశారు అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ , కమిటీ హాల్స్ నిర్మాణాలను చేపట్టాలని కోరారు. ఎస్సీ ఎస్టీ కేసుల విషయంలో అధికారుల ఉదాసీనత ,నిర్లక్ష్య వైఖరి మురళి , నకరికంటి సంజీవరావు కేసుల విషయంలో స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. అధికారులు వీటిపై దృష్టి పెట్టి , సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి తోడ్పాటు నివ్వాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను తల పెడతామని హెచ్చరించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు దాసరి శ్రీను, కామ ప్రభాకర్, పడిగ పల్లి నాగేశ్వరరావు, నారు మళ్ళ వెంకటేశ్వర్లు, వీరన్న నాయక్ ,శ్రీనివాస్ ,చింతల వెంకటేశ్వర్లు ,కుక్కల రాములు ,జి . అర్జునరావు ,నాగేందర్ కుమార్ ,జ్యోతి ,లక్ష్మి ,కృష్ణవేణి, స్పందన, శ్రీదేవి, షరీఫా, సరోజని, లత , సుధ , కోమలి, స్వాతి, తలారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పాలన పై నమ్మకంతో బీఆర్ఎస్ వైపు బిజేపి నేతల అడుగులు.

**రాయపోల్, డిసెంబర్ 27:** రాయపోల్ మండలంలో నాయకులు బిఆర్ఎస్ వైపు అడుగులు వేస్తూ,పార్టీని బలోపేతం చేస్తున్నారు.దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నాయకత్వాన్ని నమ్ముతూ రాయపోల్ మండలం లోని గొల్లపల్లి%-%ఉదయపూర్ గ్రామాల నుంచి బీజేపీకి చెందిన పలువురు కీలక నేతలు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు.నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ భూపాల్ తో పాటు బీజేపీ పార్టీ గ్రామ అధ్యక్షుడు కనకయ్య,వార్డు సభ్యులు సత్తయ్య,కనకయ్య,రవి, అలాగే నాయకులు కుమార్, మహేష్, కనకయ్య,స్వామి, నర్సింలు,స్వామి తదితరులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా పార్టీలో చేరారు.ఎంఎల్ఏ కొత్త ప్రభాకర్ రెడ్డి వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా గ్రామ స్థాయిలో నమ్మకం కోల్పోయిందన్నారు. కేసీఆర్ గారి దశాబ్ద పాలనలో తెలంగాణ అభివృద్ధి పథంలో పయనించిందని, రైతు-పేద-మహిళ-యువతకు అండగా



నిలిచింది బీఆర్ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడనుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన నేతలు గ్రామాల నుంచే బీఆర్ఎస్‌ను మరింత బలపరుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపి పనిచేయడం వల్ల ఎంతో సంతృపిని కలిగిస్తుంది

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, డిసెంబర్,27(సమయం న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపి పనిచేయడం వల్ల ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రాష్ట్ర ఎన్నికల కార్యదర్శిగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా రెవెన్యూ, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... ఉద్యోగ బాధ్యతలలో భాగంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించాలన్నారు. బదిలీపై వెళ్తున్న లింగ్యా నాయక్ రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపారని కలెక్టర్ తెలిపారు. అధికారుల దృష్టిలో మానవత్వం ఉన్న వ్యక్తిగా, మృదు స్వభావిగా, సౌమ్యులుగా గుర్తింపు తెచ్చుకోవడం అంటే లింగ్యా నాయక్ కలుపుగోరుతనానికి నిదర్శనమని కలెక్టర్ కొనియాడారు.ప్రతి సమస్యను క్షుణ్ణంగా అధ్యాయనం చేసి పరిష్కరించడంలో తన కృషి ఎంత ఉందని కలెక్టర్ అన్నారు.బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ... వికారాబాద్ జిల్లాలో పనిచేయడం వల్ల మంచి అనుభూతిని పొందానన్నారు. ఈ ప్రాంత వాతావరణం అనారోగ్యానికి గురికాకుండా సహకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని నాయకులు, ప్రజలు తమ సహాయ సహకారాలు అందించడం వల్ల ఉద్యోగ ధర్మాన్ని కూడా ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించగలిగానని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అందరిని భాగస్వాములు చేస్తూ ముందుకు వెళితే సమస్యల పరిష్కారం సులువుగా అవుతుందని ఆయన అన్నారు.వీడ్కోలు సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, డిఆర్ఓ మంగీలాల్, జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, డిబిసిడిఓ కమలాకర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ మనందరి భాద్యత:జిల్లా కలెక్టర్



**అదిలాబాద్ డిసెంబర్ 27( సమయం న్యూస్) :** అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ మనందరి భాద్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అటవీ భూముల సంరక్షణ, ఆక్రమణల నివారణ, వన్యప్రాణుల రక్షణ, అటవీ ప్రాంతంలో మంటల నియంత్రణ, వివిధ అంశాలపై పై విస్తృతంగా చర్చించడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాంతాలలో ఆక్రమణల విస్తరణను పూర్తిగా నిరోధించాలని, ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అటవీ ప్రాంతాల్లో అర్హత లేని వారికి సాగు భూములకు రైతు బంధు, రేషన్ వంటి ప్రభుత్వ ప్రయోజనాలను రద్దు చేయాలన్నారు. అటవీ నేరాల నియంత్రణ కోసం పోలీసు, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా జాయింట్ రైడ్లు, కార్డన్ సెర్చ్‌లు నిర్వహించాలని అన్నారు. వన్యప్రాణుల సమస్యలు, రహదారి భద్రత లో భాగంగా జిల్లాలోని రిజర్వ్ ఫారెస్ట్ గుండా వెళ్తున్న జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వన్యప్రాణులు మరణిస్తున్నందున వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, సౌర బ్లింకర్లు ఏర్పాటు చేయాలని, రాత్రిపూట ట్రాఫిక్ నియంత్రణ అమలు చేయాలని అన్నారు. రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్ లేని వాహనాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అడవి మంటలు నివారణలో భాగంగా యువజన, స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అడవుల్లో మేకలు, గొర్రెల మేతను నిషేధించాలని వాటి కాపరులకు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాలని, చెట్ల నరికివేతను గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు ఎస్పీ సురేందర్ రావు, డిఆర్డీఓ రవీందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు, ఏవో వర, అటవీ క్షేత్ర అధికారులు గులాబీ సింగ్, గణేష్, సిబ్బంది, పాల్గొన్నారు.

# పంచాయితీ ఎన్నికలలో అధికార పార్టీకి చిక్కుదేరు



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 27 :** గజ్వేల్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండం మధు బిఆర్ఎస్ గజ్వేల్ టౌన్ ప్రెసిడెంట్ నవాజ్ మీరా తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు దేవీ రవీందర్ మాట్లాడుతూ మంత్రి స్థాయిలో ఉన్నటువంటి వ్యక్తులు ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ గజ్వేల్ నియోజకవర్గం లో 90 స్థానాలు గెలిచామని చెబుతున్న మీరు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను కూడా మీ ఖాతాలో వేసుకుంటారా 179 సర్పంచ్లకు గాను బిఆర్ఎస్ పార్టీ 92 స్థానాలు గెలిచింది కాంగ్రెస్ గెలిచిన స్థానాలు 68 బిజెపి 5 ఇతరులు 14 అంటే ఇండిపెండెంట్ లతో కలుపుకొని మీరు లెక్కపెట్టుకున్నట్టు ఉన్నారు బిజెపి ఇండిపెండెంట్ అభ్యర్థులను కలుపుకొని మీరు మాట్లాడిన మీరన్న 90 స్థానాలు గెలవలేదు గజ్వేల్ లో కేసీఆర్ కి ఎదురు లేదు ముఖ్యమంత్రి గారు రేవంత్ రెడ్డి హైదరాబాదులో కూర్చుని అబద్ధం ఆడినట్టే మంత్రులు కూడా గజ్వేల్ కు వచ్చి అబద్దాలు చెబుతున్నారు బిఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన సర్పంచ్లను బెదిరింపులకు గురి చేయడం తగదు ఇండిపెండెంట్గా గెలిచిన వాళ్లకు తాయిలాలు ప్రకటించడం కరెక్ట్ కాదు కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల అన్ని ఎన్నికలలో 80 శాతం శాతం సీట్లు సాధించాం మరి మీరు ఏం సాధించారు స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చి గ్రామాల అభివృద్ధి కోసం కెసిఆర్ కృషి చేశారు సర్పంచ్ ఎన్నికలు రెండు సంవత్సరాల నుంచి పెట్టకుండా ఎందుకు ఆపారు బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మాట తప్పిన మీరు మాట్లాడడం విడ్డూరం కెసిఆర్ బయటకు రావడం లేదని దుష్ప్రచారం మీరే చేస్తారు కెసిఆర్ బయటకి వచ్చి మాట్లాడితే ఎందుకు భయపడుతున్నారు రాష్ట్రంలో కెసిఆర్ అధికారంలో ఉండగా 80 శాతం శాతం సర్పంచ్లను గెలుచుకున్నాం ఈనాడు మీ పరిస్థితి ఏంటి తప్పుడు మాటలతో కాలం వెళ్లదీయడం డైవర్ట్ పాలిటిక్స్ తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం కారు పంచర్ కాలేదు సర్పంచ్ ఎన్నికలలో ఫోర్త్ గేరు రేపు జరగబోయే జడ్పిటిసి ఎంపీటీసీ మున్సిపల్ ఎన్నికలలో టాప్ గేర్ లో వెళ్తుందని అది చూసి తట్టుకోలేని మంత్రులు గజ్వేల్ కి వచ్చి ఏది పడితే అది మాట్లాడుతున్నారు స్థానిక నాయకులతో నిజమైన డాటా తెప్పించుకొని మాట్లాడితే బాగుండేదేమ పార్టీలను పక్కనపెట్టి సర్పంచ్ గా గెలిచిన అందరు అభ్యర్థులకు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి పాటుపడండి తప్ప బెదిరింపు రాజ రాజకీయాలు మా పార్టీలోకి వస్తేనే నిదురిస్తాం లేకుంటే ఇవ్వం అని మాట్లాడడం సరైన పద్ధతి కాదు గజ్వేల్ గడ్డ కెసిఆర్ అడ్డా రేపు జరగబోయే జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో కూడా బిఆర్ఎస్ జండా గజ్వేల్ లో ఎగరబోతుంది ఇప్పటికైనా గౌరవ మంత్రులు తప్పుడు మాటలు మాట్లాడకుండగా ప్రజలకు నిజం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం కల్యాణ్ కార్ నర్సింగ్ రావు ధర్మ రెడ్డిపల్లి సర్పంచ్ కాసమొల్ల శ్రీనివాస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి చేపర్తి సురేష్ మద్ది నరేందర్ గాలెంక శ్రీనివాస్ ఉబ్బని నవీన్ సంతోష్ పాల్గొన్నారు

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు.

- జిల్లా ఎస్పీ: డాక్టర్.వినీత్.ఐపీఎస్
- మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి




**నారాయణపేట, డిసెంబర్,27(సమయం న్యూస్) :** ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడి గాచేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు.మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్. ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు.సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి,అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

# ప్రతి సొసైటీలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండాలి

- రైతులకు ఇబ్బందులు ఏర్పడితే అధికారులదే బాధ్యత
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- ఖానాపూర్ లో ఎరువుల గిడ్డంగి ఆకస్మిక తనిఖీ



**నిజామాబాద్, డిసెంబర్ 27 ( సమయం న్యూస్)** జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్ లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్దంగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. యాసంగి సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి సొసైటీకి ఎరువులను చేరవేస్తూ, రైతులకు పంపిణీ జరిగేలా కృషి చేయాలన్నారు. ఖానాపూర్ లోని ఎరువుల గిడ్డంగిని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్ లో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఇప్పటివరకు జిల్లాకు ఈ సీజన్ లో వచ్చిన ఎరువుల నిల్వలు ఎన్ని, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ కూడా ఎరువుల కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు చేరవేయాలని అధికారులకు సూచించారు. ఎరువుల కోసం ఎక్కడైనా రైతులు ఇబ్బందులు పడితే, సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడ కూడా ఎరువుల కోసం రైతులు క్యూ లైన్ లలో నిలబడడం వంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా, ముందుగానే వారికి రెండు విడతలకు సరిపడా ఎరువుల బస్తాలను సొసైటీల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. ఎరువుల కేటాయింపులు, పంపిణీ ప్రక్రియలను ప్రతి రోజు పర్యవేక్షించాలని, ఎక్కడైనా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు నెలకొని ఉంటే పరస్పర సమన్వయంతో వెంటనే వాటిని పరిష్కరించుకోవాలని వ్యవసాయ, మార్క్ ఫెడ్, సహకార శాఖల అధికారులకు హితవు పలికారు. ఎరువుల పంపిణీ తీరుతెన్నులపై ప్రతి రోజు తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. నిల్వలు మిగిలి ఉన్నప్పుడే సొసైటీల ద్వారా ఇండెంట్ పెట్టి స్టాక్ తెప్పించుకునేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని హితవు పలికారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. యూరియా ఎరువుల విషయమై రైతులు కూడా ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, జిల్లాలో ఇప్పటికే సరిపడా స్టాక్ ఉందని, ఇంకనూ యూరియా నిల్వలు ముందస్తుగానే తెప్పిస్తున్నామని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, సహకార శాఖ అధికారి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

# అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్




**పటాన్ చెరు, డిసెంబర్ 27 (సమయం న్యూస్):**పటాన్ చెరు డివిజన్ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీనివాస్ గౌడ్, దీపక్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్ర ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో యండిఆర్ ఫౌండేషన్ కో--ఫౌండర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందరరేగా మాద్రి పృథ్వీరాజ్ అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములతో కలిసి భిక్ష స్వీకరించి భక్తిభావంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. శబరిమల యాత్రకు బయలుదేరుతున్న అయ్యప్ప స్వాములకు స్వామి ఆశీస్సులతో యాత్ర సురక్షితంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.అలాగే అయ్యప్ప స్వామి బోధించిన శరణాగతి, సమానత్వం, సేవాభావం వంటి విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో నిలకడగా నిలవాలని ఈ ఆయన కోరారు. ఈ కార్యక్రమం భక్తులందరిలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపిందని నిర్వాహకులు తెలిపారు.

# TS UTF రాష్ట్ర విద్యా సదస్సు మరియు రాష్ట్ర విస్తృత సమావేశాలను జయప్రదం చేయండి

- TSUTF మండల అధ్యక్షులు గౌరారం గోపాల్




**బొంరస్ పేట మండలం, డిసెంబర్,27(సమయం న్యూస్) :** TSUTF రాష్ట్ర విద్యా సదస్సు, రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశాలు ఈ నెల 28, 29న జనగామలో జరుగుతున్న సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వికారాబాద్ జిల్లా బొంరస్ పేట ఆవరణలో టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ సన్నహాక సమావేశంలో అధ్యక్షులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పరిణామాలు ,విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాలు కల్పించడం అదే విధంగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సదస్సు లో, విస్తృత సమావేశాల్లో చర్చించి ఒక నివేదికను సమర్పించడం జరుగుతుందని అన్నారు.ఈ రాష్ట్ర విద్యా సదస్సుకి వక్తలుగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాజీ %=×% కమిషనర్ మాడభూషి శ్రీధర్ హాజరవుతున్నారని, ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయితీరాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని తెలిపారు. కావున ఈ సదస్సుకు బొంరస్ పెట మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం రవీందర్ గౌడ్ ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్లు మల్లేష్ నరేందర్ గౌడ్,ముదసిర్,మహేష్ రఘు అనిల్ మహేందర్ సిరాజ్ మహిళా నాయకులు సల్మా బేగం,లక్ష్మి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు గజ్వేల్ ఏసిపి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 27 :** గజ్వేల్ ఏసీపి కె. నర్సింలు ఆధ్వర్యంలో, గజ్వేల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. ముత్యం రాజు, ఎస్సైలు ఎస్. ప్రేమ్ దీప్, ఏ. మల్లారెడ్డి పట్టణంలోని వివిధ గాలిపటాలు మాంజా విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులు ఎవరూ కూడా నిషేధిత చైనా మాంజాను విక్రయించకూడదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి విక్రయాలు జరిపితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.చైనా మాంజా వల్ల కలిగే నష్టాలు గాజు పొడి పూత ఉన్న ఈ దారం వల్ల బైక్ రైడర్లు, పాదచారుల మెడలు, ముఖం కోసుకుపోయి ప్రాణాపాయం సంభవిస్తుంది.ఆకాశంలో ఎగిరే పక్షులు ఈ దారంలో చిక్కుకుని తీవ్రంగా గాయపడటం లేదా మరణించడం జరుగుతుంది.ఈ దారం విద్యుత్ తీగలకు తగిలితే షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.నైలాన్ రసాయనాలతో తయారయ్యే ఈ మాంజా భూమిలో కరగదు, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది.చైనా మాంజా వాడటం విక్రయం చట్టరీత్యా నేరం. దీనివల్ల జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రమాదకరమైన చైనా మాంజాను కొనివ్వవద్దని, పర్యావరణానికి ప్రజల భద్రతకు అనుకూలమైన సాధారణ పత్తి దారాన్ని మాత్రమే ఉపయోగించాలని కోరడమైనది. ప్రజలందరూ పోలీసులకు సహకరించి సురక్షితంగా పండుగ జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు

# ప్రయాణికులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు



**నారాయణపేట, డిసెంబర్,27(సమయం న్యూస్) :** నారాయణపేట బస్టాండ్లో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బస్టాండ్ లో బస్ కొరకు వెయిట్ చేస్తుంటే తమ విలువైన వస్తువులు బ్యాగులు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఎవరైనా తినుబండారాలు ఇస్తే తీసుకోరాదని మాటలు కలిపి దొంగతనాలకు పాల్పడుతుంటారని తగు జాగ్రత్తలు పాటించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా డయల్100 ఫోన్ చేయాలని సూచించారు.అలాగే సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు ఇతరులకు ఇవ్వకూడదని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ హెల్మెట్, సీటుబెల్ట్ వాడకం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అవగాహన కల్పించారు .ప్రజలు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ స్థాయిలో తపాలా సేవలు.

● వడ్డేపల్లిలో పోస్టాఫీస్ ప్రారంభం




**రాయపోల్,డిసెంబర్ 27:** గ్రామీణ ప్రాంతాల్లో తపాల సేవలను మరింత సులభతరం చేయాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో నూతన పోస్టాఫీస్ ప్రారంభమైంది. ఈ పోస్టాఫీస్‌ను గ్రామ సర్పంచ్ రేణుక శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోస్టాఫీస్ ద్వారా పొదుపు పథకాలు, బ్యాంకింగ్ లావాదేవీలు, ఆధార్ అనుసంధానం, ఆసరా పెన్షన్‌తో పాటు పలు ప్రభుత్వ సేవలను ఇకపై గ్రామస్థాయిలోనే పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నారాయణపేట ఇన్చార్జి కలెక్టర్ గా ప్రతీక్ జైన్



**నారాయణపేట, డిసెంబర్,27(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా ఇంచార్జీ ( కలెక్టర్గా ప్రతీక్ జైన్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు .జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈ నెల 17 నుంచి వచ్చే నెల (2026 జనవరి)11 వరకు లాంగ్ లీవ్ పెట్టడంతో జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు అప్పగిస్తూ సీ.ఎస్. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల జనవరి 11 వరకు జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా ప్రతీక్ జైన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## ది రివర్ ఫెస్టివల్‌లో భాగంగా భద్రాచలం తెప్పోత్సవ ఘాట్ వద్ద ఫ్లాష్ మోబ్ పెర్ఫార్మెన్స్, నది హారతి కార్యక్రమం జిల్లా కలెక్టర్



**భద్రాచలం డిసెంబర్27( సమయం న్యూస్).:** YERU - The River Festival లో భాగంగా రేపు (శనివారం) సాయంత్రం 4 గంటల నుండి భద్రాచలం తెప్పోత్సవ ఘాట్ వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం మరియు నది హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జితేష్ వి. పాటిల్, జిల్లా కలెక్టర్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 230 మంది లోకల్ యువత పాల్గొనే ఫ్లాష్ మోబ్ పెర్ఫార్మెన్స్ (Flash Mob Performance) (ఒకేసారి నృత్యం) ప్రధాన ఆకర్షణగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. యువత సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు, నదుల పట్ల అవగాహనను పెంపొందించే విధంగా ఈ ప్రదర్శనలు రూపొందించబడ్డాయని తెలిపారు.

ఫ్లాష్ మోబ్ పెర్ఫార్మెన్స్ అనంతరం నది హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గారు తెలిపారు. నదుల సంరక్షణ, ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన వివరించారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు

● అక్రమంగా అమ్ముతున్న మద్యం పట్టివేత ఇద్దరిపై కేసు నమోదు

● యాలాల ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల,మండలం డిసెంబరు 27(సమయం న్యూస్) :** బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని యాలాల ఎస్సై విఠల్ రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో తన సిబ్బంది తో కలిసి బెల్టు షాపుల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ కాలనీకి చెందిన మాల వెంకటప్ప, నారాయణ లకు చెందిన బెల్ట్ షాపుల నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిద్దరిపై కేసులు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పక ఉంటాయని ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

● కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

● రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలు



నిజామాబాద్, డిసెంబర్ 27( సమయం న్యూస్)

రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన శనివారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించి కీలక తీర్మానాలు చేశారు. ప్రమాదాలను నిలువరిం చేం దుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. జనవరి 01 వ తేదీ నుండి చేపట్టనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అవి ప్రజలకు చేరేవిధంగా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, పక్కాగా పర్యవేక్షణ జరపాలన్నారు. అతి వేగం, తాగి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా హోర్డింగ్ లు, సినిమా స్లైడ్స్, సోషల్ మీడియా, ఎఫ్.ఎం రేడియో, లోకల్ చానెల్స్, డిజిటల్ డిస్ప్లే తదితర సాధనాల ద్వారా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి, ఎత్తుపల్లాలు, గుంతలు ఉంటే వాటిని చక్కదిద్దాలని, బారికేడ్లను అమరుస్తూ, అవసరమైన చోట రాత్రి వేళల్లో తగిన వెలుతురు ఉండేలా కూడళ్ళ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రమం తప్పకుండా సమావేశాలను నిర్వహిస్తూ, ప్రమాదాల తీవ్రతను నిలువరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, తద్వారా ఎన్నో విలువైన నిండు ప్రాణాలను కాపాడగల్గుతామని అన్నారు. అధికారులు అంకితభావంతో కృషి చేస్తూ నిజామాబాద్ ను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశాలలో అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల, ఎం.వీ.ఐ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఎస్.ఈ సర్దార్ సింగ్, ఈ.ఈ ప్రవీణ్, పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్, డీ.ఎం అండ్ హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్సా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఏడాది కాలంలో 326 మంది మావోయిస్టుల లొంగుబాటు.



**కొత్తగూడెం సెప్టెంబర్27( సమయం న్యూస్).:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో పోలీసు అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేయడంలో,శాంతిభద్రతల పరిరక్షణలో ముందంజలో ఉన్నారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.

శనివారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు వార్షిక నివేదిక-2025 సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ముందుగా వార్షిక నివేదిక బుక్ లెట్ ను విడుదల చేశారు.అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ శాంతి భద్రతలకు సంబంధించి నివేదికలోని వివరాలను వెల్లడిస్తూ గత ఏడాదితో పోలిస్తే 9.65 శాతం నేరాల శాతం పెరిగిందని గత ఏడాది 5636 కేసులు నమోదు కాగా,ప్రస్తుత సంవత్సరం 2025లో 6180 కేసులు నమోదు కావడం జరిగిందని,దారి దోపిడీ 01, దోపిడిలు 05 కేసులు,దొంగతనాలు 307 కేసులు నమోదు కాబడ్డాయి.హత్యలు 23,మానభంగాలకు సంబంధించి ఏడాదిలో 83 కేసులు నమోదు కాబడ్డాయని వీటితో పాటు వరకట్న మరణాలు,డొమెస్టిక్ నేరాలు తగ్గు ముఖం పట్టగా,గత సంవత్సరం కేసులు 102 నమో దు కాగా,ఈ ఏడాది 122 నమోదయ్యాయని,పోక్సో కేసులు గత ఏడాదిలో 105 కేసులు నమోదు కాగా,ఈ ఏడాది 128 కేసులు నమోదు కాబడ్డాయని ఎస్పీ తెలిపారు.

**మహిళలపై నేరాలు తగ్గు ముఖం**

గత ఏడాదితో పోలిస్తే 420 కేసులు నమోదు కాగా, ప్రస్తుతం కేవలం 384 కేసులు మాత్రమే నమోదు కావడం జరిగింది. దీనితో మొత్తం మీద 8.57 శాతం మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

**సుమారుగా రూ.28 కోట్ల 54 లక్షల విలువైన గంజాయి పట్టివేత**

జిల్లా పరిధిలో ఈ ఏడాదిలో 70 కేసుల్లో మొత్తం 221మందిని అరెస్టు చేయడంతో పాటు వీరిని నుండి కోట్ల విలువగల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోగా,ఇందులో 5707 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, సుమారుగా 22 కోట్ల రూపాయల గంజాయిని ఈ ఏడాది తగులబెట్టడం జరిగిందని తెలిపారు.చోరీలకు సంబంధించి ఏడాది మొ-త్తం 307 కేసులలో 3,75,10,691/- రూపాయల సొత్తును కోల్పోగా,141 కేసులలోని 1,21,99,297/- రూపాయల సొత్తును రికవరీ చేయడంలో జిల్లా సీసియస్ పోలీసుల పాత్ర కీలకమన్నారు.లోక్ అదాలత్లో ఈ ఏడాది మొత్తం వివిద రకాల 20,595 కేసులు పరిష్కృతమయ్యాయని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 15,347 కేసులు నమోదు.సైబర్ సైబర్ క్రైమ్ సంబంధించి 196 కేసులు నమోదు చేయబడ్డాయని ఎస్పీ తెలిపారు.జిల్లా పరిధిలో మొత్తం 1824 కేసులు పరిష్కారం కాగా ఇందులో 07 గురికి జీవిత ఖైదు,ఇద్దరికి 20 సంవత్సరాల జైలు శిక్ష,05 గురికి 10 సంవత్సరాలు,ముగ్గురికి 07 సంవత్సరాల శిక్షలు ఖరారు కాబడ్డాయి.రాబోయే నూతన సంవత్సం ౦లో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని,శాంతి భద్రతల పరిరక్షణే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.ముఖ్యంగా చిన్నపిల్లలపై జరిగే లైంగిక నేరాలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాము.రోడ్డు ప్రమాదాల నివారించడం,స్థానికంగా గంజాయి సరఫరా,అక్రమంగా రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమములో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,ఇల్లందు డిఎస్పి చంద్ర భాను,కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన బీఆర్ఎస్

● మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం



**వికారాబాద్, డిసెంబర్,27(సమయం న్యూస్) :** పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన మీడియా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేష్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచి రెడ్డి కిషన్ రెడ్డి,పట్నం నరేందర్ రెడ్డి తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్రేగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ%ౌా% పాలమూరు%--%రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని అన్నారు. ప్రాజెక్టు పనులపై ద ృష్టి సారించకుండా తట్టెడు మట్టి తీయకుండ, నిరాధార వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సోయి తెచ్చుకొని వెంటనే పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల గ్రామస్థాయి, మండల స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మొండి వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు ఏకగ్రీవంగా ప్రాజెక్టు పూర్తి విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిరయించారు.

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

● ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మెదక్ డిసెంబర్27( సమయం న్యూస్).:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం పాపన్నపేట మండలంలోని ఏడుపాయల దుర్గాభవాని మాతను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. చైర్మన్ కు ఆలయ అధికారులు, పురోహితులు పూరకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గరగుడిలో వనదుర్గా మాత కు ప్రత్యేక పూజలు చేసి శాలువా పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందరరేగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నూతన సంవత్సరంలో మరింత ఆనందంగా ఉత్సాహంగా ఉంటూ ప్రజల కోరికలు నెరవేరాలని దుర్గామాతకు మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంట నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్ రెడ్డి, స్థానిక తహసిల్దార్...., ఆలయ ఈవో.. అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణం కు భూమి పూజ

- నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణం కు భూమి పూజ చేసిన రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఎన్.వి. శ్రావణ్ కుమార్,హై కోర్టు న్యాయమూర్తులు
- కక్షి దారులకు సత్వర న్యాయం అందాలి,రాజ్యాంగ హక్కులు రక్షించాలి
- రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్



**మహబూబ్ నగర్ డిసెంబర్27( సమయం న్యూస్)**: కక్షిదారులకు సత్వర న్యాయం అందాలని,రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కు కృషి చేయాలని న్యాయవాదులు ,న్యాయ మూర్తులను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మహబూబ్ నగర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ అన్నారు.శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 81 కోట్ల రూ.ల వ్యయంతో నిర్మించనున్న నూతన కోర్టు భవన సముదాయం కు ఆయన హై కోర్ట్ న్యాయ మూర్తులు జస్టిస్ కె. లక్ష్మణ్,జస్టిస్ జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డి,జస్టిస్ టి.మాధవి,జస్టిస్ నందికొండ నర్సింగరావు లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం 2 ఎకరాల 5 గుంటల స్థలంలో సరిపోని విధంగా ఉందని,నూతన కోర్టు భవన సముదాయం విశాలంగా నిర్మించాలని ప్రభుత్వం 14 నవంబర్ 2024 లో ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు 10 ఎకరాల 5 గుంటల స్థలం లో జిల్లా కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీ కి దగ్గర బండమీది పల్లి లో 81 కోట్ల రూ.లతో స్టిల్ట్ తో కలిపి %స%03 న10o2 కోర్టుల భవనం నేడు( శనివారం) శంకుస్థాపన చేసుకుంటున్నట్లు తెలిపారు.ఈ భవనం ను 24 నెలల కాలంలో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.మహబూబ్ నగర్ జిల్లాకు భౌగోళికంగా,పరిపాలన పరంగా ప్రాముఖ్యత ఉందని,వ్యవసాయం జీవనోపాధిగా,పట్టణీకరణ తో అభివృద్ధి చెందుతున్న జిల్లా అని పేర్కొన్నారు.నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టు కు వచ్చే కక్షి దారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయ మూర్తులు సమర్థవంతంగా పని చేయాలని అన్నారు.30 నవంబర్ 2025 నాటికి మహబూబ్ నగర్ లో 18446 కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు.మౌలిక సదుపాయాలు కల్పన తో కోర్ట్ లు పెండింగ్ కేసులు తగ్గించే విధంగా న్యాయవాదులు కృషి చేయాలని అన్నారు.మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 16,జడ్చర్ల లో 3 కోర్టులు 19 కోర్ట్ లు ఉన్నాయని తెలిపారు.జిల్లాలో 293 మంది సిబ్బంది కి గాను 252 మంది ఉన్నట్లు వెల్లడించారు.జిల్లా లో 504 మంది అడ్వకేట్ లు ఉండగా,35 మంది మహిళా అడ్వకేట్ లు ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు.జిల్లాను కలెక్టర్,ఎస్.పి.,జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మహిళలు కావడం గొప్ప విషయమని తెలిపారు. హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ నూతన కోర్టు భవన సముదాయం శంకుస్థాపన చేసుకోవడం కక్షిదారులు,న్యాయ వాదుల చిరకాల కోరిక నెరవేరిన సందర్భం గా వర్ణించారు. పాలమూరు జిల్లా అసలు పేరు రుక్మాపూర్ అని,1890 లో మహబూబ్ నగర్ గా మారిందని తెలిపారు.పాలమూరు లో భూముల రేట్లు పెరిగాయి.ఒకప్పటి కరవు జిల్లా అభివృద్ధి లో ముందుకు వెళ్తుందని అన్నారు.జిల్లా ప్రజలు ప్రేమ గలవారని అన్నారు.కోర్ట్ లలో పెండింగ్ కేసులు కేవలం న్యాయ అధికారులు,న్యాయవాదుల దే బాధ్యత కాదని , అందరికి బాధ్యత ఉందని అన్నారు.హై కోర్ట్ లో 27 నుండి 42 కు న్యాయ మూర్తులు పెరిగి నప్పటికీ 2,33,000 కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు.జిల్లా కోర్టు 18,446 కేసులు పెండింగ్ లో నున్నట్లు తెలిపారు.అమెరికాలో 97 శాతం కేసులు ట్రయల్ కు వెళ్లవని, అప్పీలేట్ కోర్ట్ కు వెళ్ళే కేసులు కేవలం ఒక శాతం మాత్రమే నని తెలిపారు.బ్రీ బార్గెన్ చేస్తారని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు తగ్గించుకోవాలి .న్యాయవాదులు కమ్యూనిటీ పెద్దలకు మధ్యవర్తిత్వం శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు.మొదటి దశ పూర్తి చేసినట్లు, రెండవ,మూడవ దశ పూర్తి చేయాలని అన్నారు.కేసులు పెండింగ్ సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉంటే ప్రజలు వ్యవస్థ పై విశ్వాసం కోల్పోతారని తెలిపారు .ఇటీవలజూనియర్ సివిల్ జడ్జి లకు 150 మందికి నియామకం కు నోటిఫికేషన్ వేస్తే 49 మంది మాత్రమే ఎంపిక అయ్యారని తెలిపారు.జూనియర్ లు సీనియర్ లను గౌరవించాలి పని నేర్చుకోవాలని అన్నారు.జిల్లా నుండి జూనియర్ సివిల్ జడ్జి లు కనీసం 25 మంది ఎంపిక కావాలని తెలిపారు రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ బి.విజయ్ సేన్ రెడ్డి మాట్లాడుతూ కేసుల సంఖ్య పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని,భూ తగాదాలు ఉదాహరణగా పేర్కొన్నారు. గత ంలో కోర్టుకు కు వెళ్లాలంటే ఆలోచించే వారని,నేడు కోర్ట్ కు వెళితే పరిష్కారం లభిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,లీగల్ ఎయిడ్,లోక్ అదాలత్ లు వంటి సంస్థలు కారణమని అన్నారు.సమాజం కు లాయర్ లు ముఖ్యమని,కుటుంబ,రాజకీయ,తగాదాలకు న్యాయ వాదులు సలహా ఇస్తారని,జడ్జికి, కక్షి దారునికి న్యాయవాది సంధానకర్త గా ఉంటారని అన్నారు.సాంకేతిక పరిజ్ఞానం మౌలిక వసతుల కల్పనలో స్వీకరించాలని అన్నారు.పేరు, ఆస్తులు సంపాదించారని,వచ్చే తరం కు సరైన గైడెన్స్ ఇవ్వడం లో వెనకబడి ఉన్నామని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. జస్టిస్ టి.మాధవి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా నా పుట్టినిల్లు,మెట్టినిల్లు అని తెలిపారు.జిల్లా ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉన్న జిల్లా పాల లాంటి మనస్సు ఉన్న ప్రజలు జిల్లా ప్రజలు అని ఆమె అన్నారు.శ్రమ పడే మనస్తత్వం ఉన్న వారు నాయకత్వం లో ముందు వరుసలో ఉన్న జిల్లా అని పేర్కొన్నారు 1833 లో నిర్మాణం చేసుకున్న ప్రస్తుత భవనం 1951 లో జిల్లా కోర్టు గా ఏర్పడినట్లు తెలిపారు.మౌలిక వసతుల కల్పన తో ఒక విశ్వాసం,ధైర్యం వస్తుంది అన్నారు.సాంకేతిక ప్రగతిని ఎంత వరకు ఉపయోగించుకోవాలో అంత వరకే ఉపయోగించుకోవాలని అన్నారు.కృత్రిమ మేధ ఏ ఐ .టూల్ గానే ఉపయోగించాలి సమాధానం కు కాదని అన్నారు. జస్టిస్ నందికొండ నర్సింగ రావు మాట్లాడుతూ కేసులు పెరగడం కక్షిదారులు పెరిగారని, కోర్టులు పెరగడం,వసతులు తగ్గడం,ఇరుకు గదులలో పని చేయడం జరుగుతుందని అన్నారు.న్యాయ కార్యదర్శిగా బిల్డింగ్ కమిటీ సభ్యునిగా కోర్ట్ నూతన భవనానికి 10 ఎకరాల 5 గుంటల స్థలం కేటాయించడం జరిగిందని అన్నారు.నేడు శంకుస్థాపన కు రావడం సంతోషం కలిగిందని అన్నారు శుభ పరిణామం అన్నారు.ఆర్%డ%బి శాఖ ద్వారా భవనం త్వరగా నిర్మాణం అయ్యేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు.సమావేశంలో ప్రిన్సిపల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి.డి.జానకి,అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ,డిప్యూటీ సొలిసిటర్ జనరల్ భుజంగ రావు,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మహబూబ్ నగర్ బార్ అసోసియేషన్ చైర్మన్ అనంత రెడ్డి,ప్రధాన కార్య దర్శి శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు

# జిన్నారం జీవనజ్యోతి జ్యోతిర్లింగం క్షేత్రం అభివృద్ధికి సహకారం


- మరో మారు తన దైవభక్తిని చాటుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్..
- భారీ విరాళాన్ని అందించిన పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,జిన్నారం ,డిసెంబర్ 27(సమయం న్యూస్):** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నిర్మిస్తున్న జీవనజ్యోతి జ్యోతిర్లింగం శివాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారీ విరాళం అందించి మరో మారు తన దైవభక్తి చాటుకున్నారు. శనివారం ఉదయం స్థానిక నాయకులు, గ్రామ పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దేవాలయం అభివృద్ధి కోసం 16 లక్షల రూపాయలు భారీ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించి మరో మారు తన దైవభక్తి చాటుకున్నారు. జీవనజ్యోతి జ్యోతిర్లింగం క్షేత్ర అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. దేవాలయం నిర్మాణ అంశంలో ప్రతి ఒక్కరి సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పటాన్ చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులచే ఇప్పటివరకు 200 పైగా దేవాలయాలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులోను నిర్మించబోతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరిలో పరమతసహనం పొందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. శివ భక్తుల విజ్ఞప్తి మేరకు ఆలయం పరిధిలో నిత్యాన్నదానం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ సమీపంలో గల దంపు యార్డును వేరే స్థలానికి మార్చాలని మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం జిన్నారంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం కోసం ఒక లక్ష 50 వేల రూపాయల విరాళాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక నాయకులు బోజిరెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గాండ్ల శ్రీనివాస్, వడ్ల ఆనంద్ చారి, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వేదమంత్రాలు, శంఖనాదం మధ్య గోదావరి నదికి ఘనంగా హారతి

- "రామ లక్ష్మణ జానకి జై - జోలో హనుమాన్ కి జై"
- నినాదాలతో మారుమోగిన పరివాహక ప్రాంతం



**భద్రాచలం డిసెంబర్27( సమయం న్యూస్):** .:శ్రీరామచంద్ర మూర్తి దివ్య సన్నిధానంలో ప్రవహిస్తున్న గోదావరి నది అపారమైన మహిమ కలిగినదని, ఈ నదిలో నిత్యం ఒక కోటి తీర్థాలు కలిసి ప్రవహిస్తాయని పురాణాలు తెలియ జేస్తున్నాయని అర్చకులు తెలిపారు. వేదకాలం నుంచే గోదావరి నదిని తల్లి సమానంగా భావిస్తూ, వేదాల్లో నదికి సంబంధించిన అనేక సూక్తులు, ప్రార్థనలు ఉన్నాయని వారు తెలిపారు. 'సూక్తి' అంటే మంచి మాటలు, కష్టాలు కలగనీయకుండా కాపాడమని తల్లిని ప్రార్థించే భావం అందులో ప్రతిఫలిస్తుందని వివరించారు.రామాయణ కాలంలో అరణ్యవాసానికి వచ్చిన సందర్భంలో సీతాదేవి కూడా గోదావరి నదిని దేవతగా భావించి, నదిలో లభించే వనరులు మానవ జీవనానికి ఆధారమని పేర్కొన్న సందర్భాలు ఉన్నాయని అర్చకులు గుర్తు చేశారు. మన జీవనానికి తోడ్పడే ప్రకృతి అంశాలను భగవంతుడిగా భావించి ఆరాధించడం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతగా వారు వివరించారు. ఈ పరంపరలో భాగంగా వేదమంత్రాల ఉచ్ఛారణతో కార్యక్రమాన్ని ప్రారంభించి, శంఖనాదం మధ్య పుష్పాలు సమర్పిస్తూ గోదావరి నదికి ఘనంగా హారతి నిర్వహించారు. గోదావరి హారతి అర్చకులు నది హారతి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. "రామ లక్ష్మణ జానకి జై -- %జోలో హనుమాన్ కి జై" అనే జయజయధ్వానాలతో గోదావరి పరివాహక ప్రాంతమంతా మారుమోగి, నది తీర ప్రాంతాలు భక్తి భావంతో ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని గోదావరి తల్లికి భక్తిశ్రద్ధలతో హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , దేవస్థానం ఈఓ దామోదర్ రావు, అధికారులు, భక్తులు పాల్గొని గోదావరి నది హారతి కార్యక్రమాన్ని తిలకించారు.

# కేంద్ర కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా త్వరలో భారీ నిరసన సభ

- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, డిసెంబర్ 27(సమయం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పటాన్ చెరుకేంద్రంగా త్వరలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయ ఆవరణలో నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్న కార్మికులపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తోందని విమర్శించారు. 29 పాత కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు నూతన కార్మిక చట్టాలను తీసుకురావడం దుర్మార్గమని ఆయన వ్యాఖ్యానించారు.ప్రధానంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ ల నిబంధనల వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, పెద్ద సంస్థల్లో కూడా ప్రభుత్వ అనుమతి లేకుండానే ఉద్యోగులను తొలగించే అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలు పెరిగే అవకాశం ఉండటంతో కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. వచ్చే సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయనున్న లేబర్ కోడ్స్ ద్వారా ప్రస్తుత 29 కార్మిక చట్టాల ద్వారా లభిస్తున్న కనీస హక్కులు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. న్యాయస్థానాల ద్వారా కార్మికులు పొందే హక్కులను కూడా నూతన లేబర్ కోడ్స్ నిరాకరిస్తున్నాయని ఆరోపించారు. పాత కార్మిక చట్టాల్లో కనీస వేతనాల నిర్ణయం కేంద్రం--రాష్ట్రాల ఉమ్మడి అంశంగా ఉండేదని, కానీ నూతన లేబర్ కోడ్స్‌లో రాష్ట్రాల హక్కులను తొలగించడం బాధాకరమని అన్నారు. ఇకపై కనీస వేతనాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, రాష్ట్రాల పరిధిలోని వేతనాలు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడల్లో ఒకటైన పటాన్ చెరు నియోజకవర్గంలో ఈనూతన చట్టాలు కార్మికుల పాలిట ఆశనిపాతంగా మారబోతున్నాయని హెచ్చరించారు. నూతన కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పటాన్ చెరులో నిర్వహించబోయే భారీ నిరసన సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్మికుడు కంకణబద్ధులై ముందుకు రావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. వివిధ కార్మిక సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసిన అమీన్ పూర్, పటాన్ చెరు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు



**పటాన్ చెరు, డిసెంబర్ 27 (సమయం న్యూస్) :** జీహెచ్ఎంసీ పరిధిలో నూతనంగా ఏర్పడిన అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన ప్రదీప్ కుమార్ శనివారం సాయంత్రం పటాన్ చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ, అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చిత్తశుద్ధితో చేపట్టాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కూడా ఆయన ఆదేశించారు.అదేవిధంగా, పటాన్ చెరు కేంద్రంగా నూతనంగా ఏర్పడిన జీహెచ్ఎంసీ 46వ పటాన్ చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన సురేష్ కూడా శనివారం సాయంత్రం ఎమ్మెల్యే జీఎంఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నూతనంగా జీహెచ్ఎంసీలో విలీనమైన తెల్లాపూర్, ముత్తంగి, జీపీ కాలనీలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు శరవేగంగా కొనసాగించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.

# ప్రమాదాలకు గురి చేస్తున్న మాంజాదారాల అమ్మడం నిషేధించడం జరిగిందని,

- జిల్లాలో మాంజాదారాలను అమ్మే వ్యాపారులపై
- కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కే. హైమావతి



**సిద్దిపేట డిసెంబర్27( సమయం న్యూస్).:** గాలిపటాలను ఎగురవేయడానికి సాధారణ దారాలకు బదులుగా మాంజా దారాలు ఉపయోగించడం మూలంగా మాంజా ధారాలు తగిలి తరచుగా వివిధ ప్రాంతాలలో వాహనదారులు, పశువులు, పక్షులు ప్రమాదాలకు గురి కావడం జరుగుతుందని ఇలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా జిల్లాలోని వ్యాపారులు జిల్లావ్యాప్తంగా ఎక్కడ కూడా మాంజా దారాలను విక్రయించరాదని అన్నారు. ఆదేశాలను పాటించకుండా మంజాదారాలను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అలాగే అధికారులు జిల్లా వ్యాప్తంగా మాంజా దారాలు అమ్మకుండా నిగా పెట్టాలని సూచించారు.

## పాఠశాల విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ.



**కామారెడ్డి డిసెంబర్27( సమయం న్యూస్).:** కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చెస్ నెట్వర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి మండల లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాల్ మరియు జిల్లా విద్య అధికారి ఎస్ రాజు, ప్రవాస భారతీయుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ని విద్యార్థులకు చెస్ బోర్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెస్ నెట్వర్క్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు, భారతదేశం చదరంగం ప్రపంచానికి అందించిన కానుకని, దీని ద్వారా విద్యార్థులలో మేధా సామర్థ్యాలు బలపడతాయని, ఏకాగ్రత, క్రమశిక్షణ, నైపుణ్యాలు అలవాడతాయన్నారు. భారతదేశానికి చెందిన ప్రముఖ చెస్ క్రీడాకారులైన విశ్వనాథ ఆనంద్, కోనేరు హంపి, గుకేష్, అర్జున్ఇరిగేశి, ఆదర్శంగా తీసుకొని మరింత ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రవాస భారతీయుడు రాజిరెడ్డి మాట్లాడుతూ తాను మాతృభూమికి సేవ చేయడం తన అదృష్టం అన్నారు. తాను ఈ ప్రాంతానికి చెందిన వాడిని గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రపంచంలో అత్యంత ఉన్నత స్థాయిలోకి ఎదిగారని తాను ప్రస్తుతం అమెరికాలో సియారా అట్లాంట కంపెనీ ద్వారా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నానని, భారతదేశంలోని యువతకు, విద్యార్థుల కోసం విద్యా నైపుణ్యాలు, వ్యవసాయం, ఉద్యోగ కల్పన, పరిశోధన రంగాలలో తన వంతు సహకారాన్ని కే హబ్ ద్వారా అందిస్తున్నానన్నారు. రానున్న రోజులలో కామారెడ్డి జిల్లాకు సైన్స్ హబ్ స్థాపించి మరింత ముందుకు వెళ్తామన్నారు. డీఈఓ ఎస్ రాజు మాట్లాడుతూ చెస్ బోర్డులను అధ్యాపకులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. చెస్ నెట్వర్క్ ముఖ్య కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ చెస్ ద్వారా జీవన నైపుణ్యాలు, వ్యక్తిగత వికాసం పెరుగుతుందని, రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం చెస్ ట్రైనింగ్, మరియు టోర్నమెంట్లు నిర్వహించి చెస్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. డీఎస్ఓ సిద్ధిరామిరెడ్డి మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధికి చెస్ ఎంతగా ఉపయోగపడుతుందని, కామారెడ్డి జిల్లా పరిశోధనలను, నూతన ఆవిష్కరణలకు సహకారం సహకారం అందించాలని కోరారు. అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధి నితిన్ దేశాయ్, ఈసీఈబి చైర్మన్ ఎన్ లింగం,సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్, అంతర్జాతీయ చెస్ కోచ్ కంది రవి, నిజామాబాద్ జిల్లా చెస్ ప్రతినిధి వాసు గౌడ్, జిల్లా ప్రతినిధులు మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మా రెడ్డి మోహన్ రెడ్డి, రాజారెడ్డి, డాక్టర్ నారాయణ గుప్తా, చెస్ క్లబ్ సౌత్ క్యాంపస్ విద్యార్థులు , మండలంలోని వివిధ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## టార్నాకా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శాశ్వత భూమి కేటాయించాలి



**డిప్యూటీ మేయర్ వినతి...**

**హైదరాబాద్, డిసెంబర్ 27( సమయం న్యూస్,)** టార్నాకాలోని విజయ డెయిరీ కార్పొరేషన్ ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమస్యపై గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీమతి హరీ చందన దాసరి ఐఏఎస్‌ను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయ డెయిరీ కార్పొరేషన్ పాఠశాలకు ఖాళీ చేయాలంటూ నోటీసు జారీ చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని డిప్యూటీ మేయర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ పాఠశాల చింతల్ బస్తీ, ఎర్రకుంట, బాబా నగర్, హనుమాన్ నగర్, గోకుల్ నగర్ బస్తీ, ఆర్య వాటిక వంటి పరిసర ప్రాంతాల్లోని ఆర్థికంగా బలహీన వర్గాల పిల్లలకు ఏకైక విద్యా కేంద్రంగా ఉందని తెలిపారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడిందని, చిన్న గదులు, మౌలిక వసతుల లేమి, పరిశుభ్రత లోపంతో పాటు పాము ఘటనలు కూడా చోటు చేసుకున్నాయని వివరించారు. ఈ పరిస్థితుల కారణంగా విద్యార్థుల సంఖ్య 450 నుంచి 100కు తగ్గిందని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో పాఠశాల ఖాళీ చేయడం విద్యార్థుల చదువుకు తీవ్ర అంతరాయం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రస్తుత భవనానికి గడువు పొడిగించడంతో పాటు, టార్నాకాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి శాశ్వత భూమి కేటాయించాలని కలెక్టర్‌ను డిప్యూటీ మేయర్ కోరారు. ఈ విషయంలో సానుకూల నిరయం తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# ఏదులాపురం మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**● మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం , డిసెంబర్ 27 : ( సమయం న్యూస్ ):** ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతంలో ఖమ్మం రూరల్ మండల సమీకృత కార్యాలయాల భవన సముదాయ నిర్మాణ పనులకు, ఆయన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూలి పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ అభివృద్ధి పనులు కూడా ఎక్కడ తగ్గకుండా ప్రజా ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగా లేకపోయినా ఖమ్మం రూరల్ మండలంలో కార్యాలయ సముదాయ నిర్మాణ పనులు 45 కోట్ల రూపాయలతో చేపట్టామని, వీటిని 8 నుంచి 9 నెలల కాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి సుపరిపాలన అందించాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి గత 2 సంవత్సరాల కాలంలో 221 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మున్సిపాలిటీలో అవసరమైన రోడ్లు, డ్రైయిన్, త్రాగునీటి సరఫరా, ఇతర పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీనీ రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 530 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, రాబోయే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, రాబోయే 3 సంవత్సరాల కాలంలో రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. పేదలు ఆత్మగౌరవంగా భావించే సొంతింటి కలలను నెరవేర్చే దిశగా ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు రెగ్యులర్ గా చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ45 కోట్ల వ్యయంతో సమీకృత మండల కార్యాలయ సముదాయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని, మండల కార్యాలయ పనులు కూడా వడి వడిగా సాగుతున్నా యని, రాబోయే ఆగస్టు నాటికి ప్రజలకు ఈ సముదాయం అందుబాటులోకి తీసుకొని రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించి 13 శాఖల కార్యాలయాలు ఒకే చోట ఉండేలా నిర్మాణ పనులు జరుగుతున్నా యని, ఇక్కడ భవన నిర్మాణ నాణ్యతలో మంచి ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం అన్ని సదుపాయాలతో కూడిన వెయిటింగ్ హాలు, లాంజ్, అధికారులకు మంచి ఛాంబర్స్ తో కలెక్టరేట్ కంటే మెరుగ్గా మండల సముదాయ కార్యాలయ భవనాన్ని మంత్రి సూచనలు మేరకు డిజైన్ చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలంలోని 129 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ బి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఆర్డీఓ నరసింహా రావు, ఆర్ అండ్ బి ఇఇ పవార్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రామ్ ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**తెలంగాణ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఇలం ఇలంబర్తి**



**మెదక్ డిసెంబర్27( సమయం న్యూస్) :** రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులతో సమీక్షించారు ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రజల జీవితాలను కాపాడటానికి అధికారులు, ప్రజలు కలిసి పనిచేయా లన్నారు. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, వాహనాల మెయింటెనెన్స్ లోపాలు ప్రమాదాలకు ప్రధాన కారణాల గా గుర్తించి, బ్లాక్ స్పాట్ల వద్ద రహదారి లోపాల సమస్యలు లేకుండా చూడాలన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, డ్రంక్ డ్రైవింగ్ నిషేధించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ సూచించారు. పాఠశాలలు, గ్రామాల్లో రోడ్డు భద్రతా వర్క్‌షాప్‌లు, సీపీఆర్ శిక్షణ ఇవ్వాలన్నారు. రోడ్లపై తనిఖీలు, స్పీడ్ గన్‌లు, ఆక్రమణల తొలగింపు చేపట్టాలనీ రోడ్డు భద్రత మాసంలో ర్యాలీలు, పోటీలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటించి, వాహనాలు నెమ్మదిగా నడిపాలన్నారు. ల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని తెలిపారు. రహదారి, ఆర్టీసీ, పోలీసు, రెవెన్యూ ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

## భూపాల పల్లి నుండి మేడారంకు ప్రత్యేక బస్సులు.

**భూపాల పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ ఇందు.**

**భూపాల పల్లి డిసెంబర్27( సమయం న్యూస్).:** భూపాలపల్లి డిపో నుండి మేడారం మహాజాతరకు ముందుగానే ప్రత్యేక బస్సుల ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ బస్సులు భూపాలపల్లి నుండి చెల్పూర్, ఘనపూర్, ములుగు, గోవిందరావుపేట, పస్రా, తాడ్వాయి మీదుగా మేడారం వరకు ప్రయాణిస్తాయి. భూపాలపల్లి నుండి మేడారం బస్సు టైమింగ్స్:08:00, 09:00, 16:10, 17:10 గంటలకు. మేడారం నుండి భూపాల పల్లి బస్సు టైమింగ్స్:10:40, 11:40, 18:45, 19:45 గంటలకు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులపై మహాలక్ష్మి పథకం కూడా వర్తిస్తుందని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి అవసరమైతే అదనపు ట్రిప్పులు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అవకాశాన్ని జిల్లా ప్రజలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి డిపో మేనేజర్ శ్రీమతి ఎ. ఇందు గారు కోరారు.

## డెస్క్ జర్నలిస్టులు ఏం పాపం చేశారు

**● మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు**



**హైదరాబాద్ డిసెంబర్27( సమయం న్యూస్).:** సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఇవాళ ఆయన సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి డైరెక్టర్ గౌతమ్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆర్థిక స్థితిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ, ప్రైవేటీకరణకు దారితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. సంస్థలో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని, ప్రభుత్వ సంస్థలైన డిస్కాంలు, జెన్కో నుంచి రూ. 42 వేల కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉండగా, వాటిని చెల్లించకపోవడం వల్ల సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని విమర్శించారు. ప్రభుత్వమే సింగరేణికి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అలా చేయకపోతే కార్మికుల జీతాలు, సంక్షేమంపై ప్రభావం పడుతుందని హరీశ్ రావు అన్నారు. సింగరేణి నిధులతో ఫుట్బాల్ మ్యాచ్లా..కార్మికులు జీతాల కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి నిధులతో ఫుట్బాల్ మ్యాచ్లు ఆడుతున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్లో జరిగిన లియోనల్ మెస్సీ ఫుట్బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్కు రూ. 100 కోట్ల సింగరేణి నిధులు ఉపయోగించారని ఆరోపించారు. కార్మికుల బోనస్ విషయంలోనూ తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ. 6,394 కోట్ల నికర లాభం సాధించినా, బోనస్ కోసం కేవలం రూ. 2,360 కోట్లనే పరిగణించి 34 శాతం ఇవ్వడం ద్వారా కార్మికులను మోసం చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొత్తం లాభంపైనే బోనస్ ఇచ్చేవారని, ఇప్పుడు 50 శాతం కోత విధించారని ఆయన అన్నారు. ఇంకా, తెలంగాణలో పేదలకు సొంత ఇళ్లు కల్పించే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఏమైందో తెలియడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఫుట్బాల్ మ్యాచ్లపై విచారణ చేస్తామని.. అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపుతామని హరీశ్ రావు హెచ్చరించారు.

**డెస్క్ జర్నలిస్టులు ఏం పాపం చేశారు..**

అక్రెడిటేషన్ కార్డుల విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఆందోళనకు దిగారని హరీశ్ రావు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కల్పిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి.. తమ హక్కుల కోసం పోరాడుతున్న జర్నలిస్టులను అరెస్ట్ చేయించడం దుర్మార్గమని అన్నారు. వెంటనే అందరినీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు 26 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చామని, రూ. 100 కోట్ల కార్పస్ ఫండ్ ఇచ్చామని గుర్తు చేశారు. కానీ, నేడు కాంగ్రెస్ సర్కారు వచ్చాక అక్రెడిటేషన్ కార్డులను ఏకంగా 10 వేలకు తగ్గించారని కామెంట్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 252ను వెంటనే సవరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు

- డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- డెస్క్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ డిమాండ్
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున నిరసన, వినపత్రం అందజేత



**హైదరాబాద్ డిసెంబర్27( సమయం న్యూస్). :** వర్కింగ్ జర్నలిస్టులను అక్రెడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలం గాణ(డీజేఎఫ్‌టీ) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్ ప్రధాన కార్యదర్శి ఎస్కే మస్తాన్, కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ పత్రికలకు చెందిన డెస్క్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్లు అవుతుందని స్పష్టం చేశారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే జర్నలిజం అవుతుందని చెప్పారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను రెండో గ్రేడ్ వారిగా మర్చొద్దని చెప్పారు. అలాగే జీవో నంబర్ 252ను సవరించాలని, స్పోర్ట్స్, సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలో లాగా అక్రెడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కదిరవన్ కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడు కేవీ రాజారామ్, డీజేఎఫ్‌టీ కోశాధికారి నిసార్, జాయింట్ సెక్రటరీ విజయ తదితరులు పాల్గొన్నారు. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎన్‌జాట్ మద్దతు డీజేఎఫ్‌టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర నాయకులు రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, ప్రధాన కార్యదర్శి జగదీశ్ తదితరులు మద్దతు తెలిపారు. ఎస్‌జాట్ తదితర జర్నలిస్టు సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.

**ఎవరూ ఆందోళన చెందొద్దు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ**

డెస్క్ జర్నలిస్టులకూ గతంలోలాగే అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు శనివారం మహబూబాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. వారి వెంట టీడబ్ల్యూజేఫ్ నేతలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే డెస్క్ జర్నలిస్టుల పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతులపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడతానని వెల్లడించారు. జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ)కమిటీ కన్వీనర్ కాంకూరి వెంకటేశ్వరరావు, కోకన్వీనర్లు కేతిరెడ్డి అచ్చిరెడ్డి, వంశీ, శాబాదు కరుణాకర్ రెడ్డి జెడ్, టీ డబ్ల్యూ జె ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# బాక్సింగ్‌డే టెస్ట్‌లో ఇంగ్లాండ్‌దే గెలుపు!

## యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ ఎట్టకేలకు విజయం

## 14 ఏళ్ల నిరీక్షణ తర్వాత విక్టరీ

## రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టు మ్యాచ్



యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఎట్టకేలకు విజయం సాధించింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ నాలుగు వికెట్ల తేడాతో నెగ్గింది. 175 పరుగుల లక్ష్యంతో దిగిన ఇంగ్లాండ్ ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (37 పరుగులు), (బెన్ డకెట్ 34 పరుగులు), జాకబ్ బెథెల్ (40 పరుగులు) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బోలాండ్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్ తలో 2 వికెట్లు పడగొట్టారు. పూర్తిగా బౌలర్ల ఆధిపత్యం నడిచిన ఈ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. 14 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్ గెలిచింది. 2010–11లో చివరిసారిగా ఆసీస్ గడ్డపై ఇంగ్లండ్ గెలుపొందింది. 175 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ 32.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు గెలుపొందింది. జాకోబ్ బెతెల్(46 బంతుల్లో 5 ఫోర్లతో 40), బెన్ డకెట్(26 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 34), జాక్ క్రాలీ(48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, జై రిచర్డ్‌సన్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 4–0తో ఆసీస్ రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో 34.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగుల ఆధిక్యం కలుపుకొని ఇంగ్లాండ్‌కు 175 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో మొదట ఆస్ట్రేలియా 152 పరుగులకు ఆలౌట్ కాగా, ఇంగ్లాండ్ 110 రన్స్‌కు కుప్పకూలింది. దీంతో ఈ టెస్టులో తొలి రోజే 20 వికెట్లు కూలాయి. ఇక రెండో రోజూ బౌలర్ల ఆధిపత్యం కొనసాగడంతో రెండు రోజుల్లోనే టెస్టు మ్యాచ్ ముగిసింది. ఈ టెస్టు మ్యాచ్‌లో బౌలర్ల జోరు కొనసాగింది. ఇరుజట్లలోని పేసర్లు నిప్పులు చెరిగారు. బౌలర్లదే ఆధిపత్యంగా సాగిన ఈ టెస్టులో ఇరు జట్లలోని ఏ బ్యాటర్ కూడా 50ం స్కోర్ చేయలేదు. తొలుత ఆసీస్‌ను ఇంగ్లాండ్ బౌలర్లు టంగ్, అట్కిసన్, బ్రెండన్ కార్స్, బెన్ స్టోక్స్ కట్టడి చేయగా, అనంతరం ఇంగ్లాండ్‌ను ఆసీస్ బౌలర్లు నెసర్, బొలాండ్, మిచెల్ స్టార్క్ , కామెరూన్ గ్రీన్ అడ్డుకున్నారు. రెండో ఇన్నింగ్స్?లోనూ పేసర్లే సత్తా చాటారు. మ్యాచ్‌లో కూలిన మొత్తం 36 వికెట్లను కూడా పేసర్లే పడగొట్టడడం విశేషం. ఇక రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టిన ఇంగ్లాండ్ పేసర్ జోష్ టంగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. గత 15ఏళ్లలో ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఆసీస్ గడ్డపై ఇంగ్లాండ్ చివరిసారిగా 2010–11 యాషెస్‌ను 3–1తో దక్కించకుంది. ఆ తర్వాత 15ఏళ్ల నుంచి ఇంగ్లాండ్‌కు అక్కడ ఒక్క విజయం కూడా దక్కలేదు. ఈ మధ్య కాలంలో ఇంగ్లీష్ జట్టు 18 టెస్టులు ఆడింది. అందులో 16 మ్యాచ్‌ల్లో ఓడగా, రెండింటిని డ్రా చేసుకుంది. తాజా విజయంతో ఆసీస్ గడ్డ మీద 5,468 రోజుల తర్వాత ఓటముల పరంపరకు బ్రేక్ పడింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన ఈ టెస్టు మ్యాచ్ మరో అరుదైన ఘనత సాధించింది. తొలి రోజైన శుక్రవారం ఈ మ్యాచ్ చేసేందుకు 94, 199 మంది అభిమానులు స్టేడియానికి వచ్చారు. ఓ టెస్టు మ్యాచ్?కు హాజరైన ప్రేక్షకుల్లో ఇది అత్యధికం. ఇక శనివారం కూడా భారీగానే ఫ్యాన్స్ హాజరైయ్యారు. తొలి రోజులో పోలిస్తే కాస్త తక్కువగా వచ్చారు. రెండో రోజు (శనివారం) 92,045 మంది మెల్‌బోర్న్ మైదానంలో లైవ్ మ్యాచ్ చూశారు. కాగా, ఈ యాషెస్?లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత ఇంగ్లాండ్‌కు ఇదే తొలి విజయం. ఇప్పటికే సిరీస్?ను ఆసీస్ 3–1తో సొంతం చేసుకుంది. ఇక ఇరుజట్ల మధ్య ఐదో టెస్టు మ్యాచ్ సిడ్నీ వేదికగా 2026 జనవరి 04న జరగనుంది.



## ఆస్ట్రేలియా ఓటమితో టీమిండియాకు లాభం..

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ బాక్సింగ్ డే టెస్ట్ కేవలం 2 రోజుల్లోనే ముగిసింది. నాలుగో టెస్టులో మొదటి రోజు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయింది. అయితే ఇంగ్లాండ్ ప్రదర్శన ఆసీస్ కంటే దారుణంగా ఉంది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియా పరిస్థితిలో మార్పు రాలేదు. ఆసీస్ రెండో ఇన్నింగ్సులో 132 పరుగులు మాత్రమేచేసింది. 175 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మూడో సెషన్‌లో ఛేదించింది. తొలి ఇన్నింగ్స్ లో తడబడిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ లో రాణించింది. దాంతో ఆసీస్ గడ్డమీద 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025–2027 సైకిల్‌లో ఇది ఆస్ట్రేలియాకు తొలి ఓటమి. ఈ మ్యాచ్ ఫలితం భారత జట్టుకు కూడా కొంత ప్రయోజనం చేకూర్చింది. మెల్‌బోర్న్ టెస్టు లో టాస్ గెలిచి ఇంగ్లాండ్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. ఇంగ్లాండ్ తరపున తొలి ఇన్నింగ్స్‌లో జోష్ టంగ్ 5 వికెట్లు పడగొట్టడంతో ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 152 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా బౌలర్లు మైఖేల్ నెసెర్, స్కాట్ బౌలాండ్ విరుచుకుపడటంతో ఇంగ్లాండ్ 110 పరుగులకే ఆలౌట్ అయింది. మైఖేల్ 4 వికెట్లు, స్కాట్ 3 వికెట్లు తీశారు. మిచెల్ స్టార్క్ ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లను ఔట్ చేశాడు. రెండో ఇన్నింగ్స్ మరింత ఉత్కంఠగా సాగింది. ఇంగ్లాండ్ బౌలర్లు చెలరేగడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 8 మంది బ్యాట్స్‌మెన్‌లు రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. ట్రావిస్ హెడ్ 46, స్టీవ్ స్మిత్ 24 పరుగులు చేశారు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ తరపున జాక్ క్రాలీ (37), బెన్ డకెట్ (34) మంచి ఆరంభాన్ని అందించారు. ఆ తర్వాత జాకబ్ బెథెల్ 40 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025–27 సైకిల్‌లో ఇది ఇంగ్లాండ్‌కు మూడో విజయం మాత్రమే. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఇంగ్లాండ్‌తో జరుగుతున్న 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఇప్పటికే గెలిచింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025–2027 సైకిల్‌లో ఇది ఆస్ట్రేలియాకు తొలి పరాజయం. ఈ ఓటమి తర్వాత కూడా జట్టు పాయింట్ల పట్టికలో మొదటి స్థానంలోనే ఉంది. అయితే ఈ ఓటమితో ఆస్ట్రేలియా గెలుపు శాతం 100 నుండి 85.71కి తగ్గింది. జట్టుకు 72 పాయింట్లు ఉన్నాయి. ఈ ఓటమి భారత్ సహా ఇతర జట్లకు కలిసొస్తుంది. ఎందుకంటే ఆసీస్ మొదటి 6 టెస్టుల్లో ఒక్క టెస్టు కూడా ఓడిపోలేదు. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ జట్టు రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 3 మ్యాచ్‌లలో 2 గెలిచింది. ఆస్ట్రేలియా ఈ ఓటమితో న్యూజిలాండ్‌తో పాటు దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్తాన్‌లకు, భారత్‌కు ప్రయోజనం కలిగింది. భారత జట్టు 9 టెస్టుల్లో 4 మ్యాచ్‌లు గెలిచి, 4 టెస్టులో ఓడిపోయింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. ఇండియా 48.15 గెలుపు శాతంతో పట్టికలో ఆరో స్థానంలో ఉంది.

## బౌలర్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చిన విరాట్ కోహ్లీ..

విజయ్ హజారే ట్రోఫీలో విరాట్ కోహ్లీని ఔట్ చేసిన గుజరాత్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. విశాల్ వేసిన ఒక బంతికి కింగ్ కోహ్లీ ముందుకు వచ్చి షాట్ ఆడబోయాడు. కానీ ముందుకు వచ్చిన తర్వాత కోహ్లీ ఆ షాట్ ఆడలేనని గ్రహించి, డిఫెన్స్ చేయబోయాడు. అయితే కోహ్లీ బంతిని ఆపలేకపోయాడు. బంతి టర్న్ అయి బయటకు వెళ్లింది, వికెట్ కీపర్ స్టంప్ చేసి కోహ్లీ ఇన్నింగ్స్‌ను ముగించాడు. అయితే విజయ్ హజారే ట్రోఫీలో ఈ మ్యాచ్ ఢిల్లీ గెలిచింది. మ్యాచ్ తర్వాత కోహ్లీ తన వికెట్ తీసిన బౌలర్ విశాల్‌కు ఒక స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. రన్ మేషిన్ విరాట్ కోహ్లీతో పాటు ఢిల్లీకి చెందిన నలుగురు బ్యాట్స్‌మెన్‌లను విశాల్ జైస్వాల్ ఔట్ చేశాడు. అతను నితీష్ రాణా, రిషబ్ పంత్, అర్పిత రాణాలను ఔట్ చేశాడు. అందులో కోహ్లీ వికెట్ చాలా ప్రత్యేకం. విశాల్ మాట్లాడుతూ, కోహ్లీ వికెట్ జీవితాంతం మర్చిపోలేనని చెప్పాడు. విశాల్ జైస్వాల్ విరాట్ కోహ్లీని ఔట్ చేసిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, "ప్రపంచ క్రికెట్‌లో అతన్ని డామినేట్ చేయడం చూడటం నుంచి, అతడితో ఒకే స్టేడియంలో ఆడటం, ఆపై కోహ్లీ వికెట్ తీయడం వరకు, ఇది నేను ఎప్పుడూ ఊహించని ఒక క్షణం. విరాట్ భాయ్ వికెట్ తీయడం నేను ఎప్పటికీ గుర్తుంచుకునే క్షణం. ఈ అవకాశం, ఈ జర్నీ, ఈ ఆట నాకు ఇచ్చిన ప్రతిదానికీ నేను కృతజ్ఞుడను" అని క్యాప్షన్‌లో రాశాడు. తన వికెట్ తీసిన బంతిపై కోహ్లీ సంతకం చేసి ఆ బౌలర్ విశాల్ జైస్వాల్‌కు స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. యంగ్ బౌలర్ ను ప్రత్యేకంగా అభినందించడంతో పాటు అతడిలో నూతనోత్సాహాన్ని నింపేందుకు కోహ్లీ తన వికెట్ తీసిన బౌలర్ కు ఆ బంతిపై సిగ్నేచర్ చేసి ఇచ్చాడు. దాంతో ఆ బౌలర్ కు ఈ జీవితంలో మరుపురాని క్షణంలా మారిపోయింది. విరాట్ కోహ్లీ 2010 తర్వాత మొదటిసారి విజయ్ హజారే ట్రోఫీలో భాగస్వామి అయ్యాడు. కోహ్లీ డిసెంబర్ 24న ఆంధ్రతో జరిగిన మొదటి మ్యాచ్‌లో 131 పరుగులు చేశాడు. 101 బంతుల్లో ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో అతను 3 సిక్సర్లు, 14 ఫోర్లు కొట్టాడు. కోహ్లీ రెండో మ్యాచ్‌లో గుజరాత్‌పై 61 బంతుల్లో 1 సిక్సర్, 13 ఫోర్ల సహాయంతో 77 పరుగులు చేశాడు. కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీలో తొలి 2 మ్యాచ్‌లు మాత్రమే ఆడేందుకు ఢిల్లీ జట్టుతో చేరాడు. అయితే అతను ఢిల్లీ కోసం మరో మ్యాచ్ ఆడే అవకాశం ఉందని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కానీ ఇది న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్ కోసం జట్టుతో చేరడంపై ఆధారపడి ఉంటుంది.



## హర్మన్ ప్రీత్ కౌర్ అరుదైన ఘనత..

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా మహిళా జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల టీ20 క్రికెట్‌లో అత్యధిక మ్యాచుల్లో విజయాన్ని అందించిన కెప్టెన్‌గా రికార్డులకు ఎక్కింది. తిరువనంతపురం వేదికగా శ్రీలంకతో జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో.. భారత్ విజయం సాధించడం ద్వారా హర్మన్ ఈ అరుదైన ఘనత అందుకుంది. టీ20ల్లో కెప్టెన్‌గా హర్మన్‌కు ఇది 77వ విజయం. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ ప్లేయర్ మెగ్ లాన్నింగ్‌ను అధిగమించింది. మెగ్ లాన్నింగ్ 100 మ్యాచ్‌ల్లో ఆసీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించగా 76 మ్యాచ్‌ల్లో విజయాన్ని అందించింది. ఇక హర్మన్ విషయానికి వస్తే.. 130 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా 77 మ్యాచ్‌ల్లో గెలిపించింది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే ప్రత్యర్థిపై అత్యధిక విజయాలను అందించిన కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. శ్రీలంకపై కెప్టెన్‌గా హర్మన్‌కు ఇది 16వ విజయం. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ మ్యాచ్‌లో శ్రీలంక మహిళల జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. నిరీ?త 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. భారత బౌలర్లలో పేసర్ రేణుకా సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టింది. స్పిన్నర్ దీప్తి శర్మ మూడు వికెట్లు తీసింది. ఆ తరువాత షెఫాలి వర్మ (79 నాటౌట్ బీ 42 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచికొట్టడంతో 113 పరుగుల లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. ఈ విజయంతో భారత జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది.




## ఐపీఎల్‌లో బంగ్లా క్రికెటర్లు ఆడితే పిచ్‌లు డ్యామేజ్ చేస్తాం

### ఐపీఎల్‌లో బంగ్లా ప్లేయర్లు ఉండకూడని సాధువుల వార్నింగ్

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస తాజాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వరకు చేరుకుంది. అక్కడి నిరసనల సెగలు ఐపీఎల్‌ను తాకాయి. వచ్చే ఏడాది వేసవిలో జరగనున్న ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఆడేందుకు అనుమతిస్తే, ఐపీఎల్ మ్యాచ్‌లను అడ్డుకుంటామని మధ్యప్రదేశ్ ఉజ్జయిన్‌కు చెందిన సాధువులు, హిందూ మత పెద్దలు హెచ్చరిక జారీ చేశారు. ఈ లీగ్‌లో బంగ్లా ప్లేయర్లు ఆడేందుకు వీల్లేదని వారు పేర్కొన్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ హింసాత్మక దాడిలో హిందూ సమాజానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దీంతో యావత్ హిందూ సమాజం దిగ్భ్రాంతికి గురైంది. ఈ క్రమంలోనే ఉజ్జయిన్ రిన్‌ముక్తేశ్వర్ మహాదేవ్ ఆలయ ప్రధాన పూజారి మహావీర్ నాథ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన క్రికెటర్లు పాల్గొన్నట్లైతే, ఆ మ్యాచ్‌లను ఆపడానికి సాధువులు, యోధులు స్టేడియంలోకి ప్రవేశిస్తారని హెచ్చరించారు. మైదానంలోని పిచ్‌లను ధ్వంసం చేసి మ్యాచ్‌లకు అంతరాయం కలిగిస్తామని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. యితే బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దారుణాలను ఇక్కడి అధికారులు పట్టించుకోకపోవడమే కాకుండా, ఆ దేశ క్రికెటర్లను భారత్‌లో ఆడటానికి అనుమతిస్తున్నారంటూ సాధువులు మండిపడ్డారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఏ క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతించకూడని తెలిపారు. ఈ మేరకు ప్రముఖ వార్తా ఏజెన్సీ IANSతో పేర్కొన్నారు. 2026 మినీ వేలంలో బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ ధరకు దక్కించుకుంది. అతడిని రూ. 9.20 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. 2016 నుంచి ఈ బంగ్లా ఫాస్ట్ బౌలర్ ఐపీఎల్ ఆడుతున్నాడు. గత 10 సీజన్లలో అతడు ఇప్పటికాదా ఐదు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు. గత సీజన్లో ముస్తాఫిజుర్ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున కేవలం మూడు మ్యాచ్‌లే ఆడాడు. మొత్తం మీద ఐపీఎల్‌లో 60 మ్యాచ్‌ల్లో 65 వికెట్లు పడగొట్టాడు. ఓవరాల్‌గా ఈ ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ నుంచి ముస్తాఫిజుర్ ఒక్కడే ఆడనున్నాడు. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఎలా వ్యవహరిస్తుందోనని ఆసక్తి నెలకొంది. ఇలాంటి హెచ్చరికల వేళ కేకేఆర్ ఎలా స్పందిస్తుందో చూడాలి. ఈ ఐపీఎల్‌లో బంగ్లా నుంచి ఓవరాల్‌గా ముస్తాఫిజుర్ ఒక్కడే వేలంలో అమ్ముడైయ్యాడు. మరి అతడిని ఆడిస్తుందా? లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని నెలలు ఆగాల్సిందే!

# సంక్రాంతికి సందడి చేయనున్న చిరు, వెంకీ



## ఆర్ యూ రెడీ సాంగ్ ప్రోమో విడుదల

'ఆర్ యూ రెడీ' అంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు అగ్రకథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. వెంకటేశ్ అతిథిపాత్రలో సందడి చేయనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే పాట ప్రోమోను తాజాగా విడుదల చేశారు. ఈ పూర్తిపాట డిసెంబర్ 30న రానుంది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్టెప్పేస్తే.. థియేటర్లలో ప్రేక్షకుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడా అపురూప ఘట్టాన్ని 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో తెరపై చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి – నయనతార జంటగా నటించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఇందులో చిరు – వెంకీ కలయికలో ఓ పాట తెరకెక్కించినట్లు ఇప్పటికే తెలిపారు. ఇప్పుడా 'మెగా విక్టరీ మాస్ గీతం'ను ఈనెల 30న బయటకు వదలనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో చిరంజీవి, వెంకటేశ్ స్టైలిష్ లుక్స్‌లో.. హుషారుగా స్టెప్పేస్తూ కనిపించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

# కూలీపై విమర్శలు స్వాగతించిన లోకేశ్ కనగరాజ్



తన గత చిత్రంపై చాలా విమర్శలు వచ్చాయని వాటిని సరిదిద్దుకుంటానని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. రజనీకాంత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా గురించి లోకేశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని విడుదల సమయంలో వచ్చిన విమర్శల గురించి ప్రస్తావించారు. కూలీ' సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. నేను తర్వాత తీయనున్న చిత్రంలో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను. అన్ని ట్రోల్స్ వచ్చినప్పటికీ ప్రేక్షకులు రజనీకాంత్ కోసం సినిమా చూశారు. దీనికి రూ.500 కోట్లు వచ్చాయని నిర్మాతలు చెప్పారు. ఈ విషయంలో అందరికీ ధన్యవాదాలు చెప్పాలి. నేను అంచనాల ఆధారంగా కథలు రాయలేను. రాసుకున్న కథలోని పాత్రలు ప్రేక్షకుల అంచనాలు అందుకుంటే ఆనందిస్తాను. ఒకవేళ అలా అందుకోలేకపోతే.. తర్వాత సినిమాలో అయినా వాటికోసం ప్రయత్నిస్తాను' అని తెలిపారు. రజనీకాంత్, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా రజనీ తన మార్క్‌తో అలరించారు. 'వార్ 2'తో పోటీపడిన ఈ మూవీ రూ.500 కోట్లు వసూలు చేసింది. స్నేహితుడి ఆకస్మిక మరణం వెనక కారణాలను తెలుసుకునే దేవ పాత్రలో రజనీకాంత్ కనిపించారు.





## ఛాంపియన్ ప్రతి ఒక్కరూ మెచ్చే సినిమా

కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా 'ఛాంపియన్ అన్నారు హీరో రోషన్. ఈ చిత్రం యదార్థగాథలకు ప్రతిరూపం అన్నారు. రోషన్,. అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. స్వప్న దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ నిర్మించారు. నందమూరి కల్యాణ్ చక్రవర్తి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. 'ఛాంపియన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా అన్నారు హీరో రోషన్. 'ఇది పిల్లలతో కలిసి చూడాల్సిన చిత్రం. ఇది ప్రతి ఒక్కరికీ నచ్చింది' అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఈ కార్యక్రమంలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, స్వప్న దత్, జెమినీ కిరణ్, జీకే మోహన్, అనస్వర రాజన్, మిక్కీ జే మేయర్, రచ్చ రవి, సంజయ్ బలగం, యశ్ తదితరులు పాల్గొన్నారు.

# సహనా..సహనా సాంగ్ కొత్తగా చూపారు

## రాజాసాబ్ సాంగ్‌పై నిధి అగర్వాల్

ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేనని నిధి చెప్పారు. ఇకపోతే రాజాసాబ్‌లో ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను అని వెల్లడించారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131

# విశాఖలో జాతీయ గిరిజన యువ సమ్మేళనం

**30 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహణ**

**విశాఖపట్టణం:** విశాఖ మహా నగరంలో జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వర రావు తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 30 నుంచి జనవరి 5వ తేదీ వరకు 17 వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వరుసగా ఈ ఏడాది కూడా స్మార్ట్ సిటీ విశాఖలో గిరిజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. యూత్ హాస్టల్లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు సమ్మేళనంలో పాల్గొంటారని అన్నారు. స్థానిక సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేయడం, గిరిజన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఇక్కడ వారికి చాటి చెప్పడమే ఈ సమ్మేళనం లక్ష్యమన్నారు. ఈ పర్యటనలో ఆదివాసీ యువతీ యువకులు ప్రభుత్వ పారిశ్రామిక ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తారని చెప్పారు. గిరిజన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి కూడా తెలియజేయనున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో నాలుగు రాష్ట్రాల గిరిజన యువతీ యువకులు ఆయా ప్రాంతాల కళారూపాలను ప్రదర్శిస్తారని అన్నారు. దేశ పురోగతిలో గిరిజనులను భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ సమ్మేళనం ఎంతగానో దోహద పడుతుందని డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు తెలియజేశారు. పాత్రికేయుల సమావేశంలో నేరయోభారత్ రిసోర్స్ పర్సన్ ఎన్ నాగేశ్వరరావు ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్. లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

# తిరుమలలో వైకుంఠ ఏర్పాట్లు పూర్తి

**టోకెన్ ఉన్నవారికి మాత్రమే దర్శనాలు**

**తిరుపతి :** తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేపట్టారు. టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం అంటూ టిటిడి ప్రకటన చేసింది. శ్రీవాణజ టిక్కెట్లను రద్దు చేశారు. జనవరి రెండు వరకు అంటే 30 నుంచి 2 వరకు కేవలం టోకెన్ దర్శాలు మాత్రమే ఉంటాయి. ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు జరగనున్న తెలిసిందే. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ...ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు. తిరుమల వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చౌదరి తెలిపారు. డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీ టోకెన్స్ ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని ఆయన వెల్లడించారు. టోకెన్ పొందిన ప్రతి భక్తుడికీ రెండు నుంచి మూడు గంటల్లోనే వైకుంఠ ద్వారా దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఎటువంటి టోకెన్స్ లేకపోయినా.. సర్వదర్శనం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కలుగజేస్తామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 8లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పుకొచ్చారు. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామని చెప్పారు. భక్తులు టీటీడీ ఇచ్చిన సూచనలను గమనించి తిరుమల పర్యటనను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.

# అన్నమయ్య జిల్లాకు నష్టం లేదు

**వదంతులను ప్రజలు నమ్మవద్దు : మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి :** జిల్లాల పునర్విభజన పక్రియపై, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియాకు ఓ వీడియో విడుదల చేసిన ఆయన.. పునర్విభజన అంశంలో జరుగుతున్న ప్రచారం తుది నిర్ణయాలు కాదని స్పష్టంచేశారు. జిల్లా ముక్కలు కాబోతోందంటూ వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు, అవగాహనలేని ప్రచారం మాత్రమేనని పేర్కొన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను పూర్తిస్థాయిలో పరిగణలోకి తీసుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకుంటారని మంత్రి తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగానే కొనసాగుతుందని మంత్రి మరోసారి స్పష్టం చేశారు.. రాయచోటి ప్రజలు, నాయకులు ప్రభుత్వం పట్ల పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, జిల్లా కేంద్రం విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని ఆయన భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో, త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి జిల్లాలోని తాజా పరిస్థితిని వివరించి, సమస్యకు పరిష్కారం చూపుతామని.. ప్రజల అభిప్రాయానికే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పరిపాలన మరింత మెరుగుపడేలా మాత్రమే పునర్విభజన మార్పులు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. వదంతులు వ్యాప్తి చేసే అసత్య ప్రచారాలను ప్రజలు అప్రమత్తంగా గమనించాలని ఆయన కోరారు. ప్రభుత్వం తుది నోటిఫికేషన్ ప్రకటించే వరకు అనధికారిక ప్రచారాలను విశ్వసించవద్దని మంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలి

**బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**అమరావతి :** బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన మాధవ్.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దురాగతాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రాజకీయ పార్టీ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించి.. పొరుగు దేశంలో హిందువుల రక్షణ కోసం గళం విప్పాలని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడు లను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారని మాధవ్ పేర్కొన్నారు. హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు కొంత ఊరట నిస్తున్నా యన్నారు. భారత విదేశాంగశాఖ బంగ్లాదేశ్‌పై ఘాటు గానే స్పందించిందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు మాధవ్.

# పవన్ కళ్యాణ్‌పై అనుచిత పోస్టులు

**మండిపడుతున్న జనసైనికులు**

**గుంటూరు :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై తరచుగా అనుచిత పోస్టులు పెట్టడం సంచలనం రేపుతోంది. రాజకీయ, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అసభ్యకరమైన వ్యాఖ్యలతో పవన్‌ను ఉద్దేశించి పలువురు అనుచిత పోస్టులు పెట్టడం పరిపాటిగా మారింది. ఇలాంటి కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజాగా మరోసారి పవన్‌పై అసభ్యకరమైన పోస్టు పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. అది కూడా ఇటీవల ఇప్పటంలో ఓ వృద్ధురాలిని పవన్ కలిసిన ఫొటోలను అసభ్యకర రీతిలో పోస్టు చేశాడో వ్యక్తి. దీనిపై జనసేన నేతలు, కార్యకర్తలు, పవన్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఇచ్చిన మాట కోసం ఇటీవల గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి పవన్ వెళ్లిన విషయం తెలిసిందే.

# 18 ఏళ్లయినా అందని న్యాయం

- మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన అయేషా మీరా తల్లిదండ్రులు
- అసలైన దోషులను శిక్షించాలి.. సాక్ష్యాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- మంగళగిరిలో మహిళా కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం



**మంగళగిరి, డిసెంబర్ 27 (సమయం న్యూస్):**

సంచలనం సృష్టించిన బీ.ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య జరిగి నేటికి 18 ఏళ్లు పూర్తయినా, తమకు ఇంకా న్యాయం జరగలేదని ఆమె తల్లిదండ్రులు శంషాద్ బేగం, బాషా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ కూతురిని పొట్టనబెట్టుకున్న అసలైన దోషులను శిక్షించాలని కోరుతూ శుక్రవారం మంగళగిరిలో మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 18 ఏళ్ల అలుపెరగని పోరాటం2007 డిసెంబర్ 27న 19 ఏళ్ల అయేషా మీరా అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ ఘటన జరిగి 18 ఏళ్లు గడుస్తున్నా, అసలు నేరస్తులు ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. దర్యాప్తు పేరుతో కీలక సాక్ష్యాలను ధ్వంసం చేసి, అమాయకుడైన పిడతల సత్యం బాబును ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. తొమ్మిది సంవత్సరాల జైలు శిక్ష అనంతరం సత్యం బాబు నిర్దోషిగా విడుదల కావడం వ్యవస్థలోని లోపాలకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.సీబీఐ నివేదికపై నిరాశ2018లో ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు ప్రారంభించినా ఫలితం లేకపోయిందన్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన వారిని కాపాడేందుకు కీలక సాక్ష్యాలను మాయం చేశారని, ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా 2025 జూన్ 25న హైకోర్టులో సీబీఐ సమర్పించిన సీల్డ్ కవర్ నివేదిక తమను తీవ్రంగా నిరాశపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం స్పందించాలిఅయేషా మీరా హత్య జరిగిన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నాడు తమకు అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అయేషా మీరా చనిపోయిన రోజును 'స్మరణ దినం'గా ప్రకటించాలని, ఆమె పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని అయేషా మీరా కుటుంబానికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

# ఆధునిక సాంకేతికతతో నేరాల కట్టడికి చర్యలు

- రాష్ట్ర క్రైమ్ రివ్యూ సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత
- సైబర్ క్రైమ్, డీప్ ఫేక్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి
- నేర పరిశోధనలో ప్రతిభ చూపిన 12 మంది అధికారులకు సన్మానం

**అమరావతి, డిసెంబర్ 27 (సమయం న్యూస్):**

నేరాల నియంత్రణ, కేసుల త్వరిత పరిష్కారమే లక్ష్యంగా తాడేపల్లిలో రాష్ట్ర స్థాయి 'క్రైమ్ రివ్యూ' సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై, పోలీస్ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది నమోదైన నేరాలు, వాటిలో శిక్షలు పడిన శాతం, కేసుల దర్యాప్తు పురోగతిపై మంత్రి ఆరా తీశారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో పోలీసు శాఖకు సవాలుగా మారుతున్న సైబర్ క్రైమ్, క్రిప్టో కరెన్సీ మోసాలు, బ్లాక్ చైన్ టెక్నాలజీ, డీప్ ఫేక్ టెక్నాలజీ వంటి ఆధునిక నేరాలను ఎదుర్కోవడంపై సుదీర్ఘంగా చర్చించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.టెక్నాలజీతో వేగవంతమైన న్యాయంరాబోయే నూతన సంవత్సరంలో కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేర పరిశోధనలో



ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది అధికారులను ఈ సందర్భంగా మంత్రి అనిత సన్మానించి, ప్రశంసించారు. వారి పనితీరు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. సమావేశంలో సీఐడీ డీజీ డాక్టర్ రవిశంకర్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, 10 మంది సీఐడీ ఎస్పీలు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, నిపుణులైన ప్రొఫెసర్లు పాల్గొన్నారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఏరియా ఆసుపత్రికి కార్పొరేట్ హంగులు

- రూ.2.10 కోట్లతో నిర్మించనున్న ప్రసూతి నిరీక్షణ కేంద్రానికి శంకుస్థాపన
- అత్యాధునిక టిఫా స్కానింగ్ మిషన్ ప్రారంభం

**నర్సీపట్నం:** నియోజకవర్గాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.2 కోట్ల 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రసూతి నిరీక్షణ కేంద్రం (బర్త్ వెయిటింగ్ హాల్) నిర్మాణానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.వి.ఎల్.పి రాజుతో కలిసి స్పీకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.35 లక్షల విలువైన అత్యాధునిక టిఫా స్కానింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ, 1985లో ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన ఈ ప్రాంతీయ ఆసుపత్రి నేడు వేలాది మందికి సేవలందిస్తోందని గుర్తుచేశారు. నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిపై ఉన్న నమ్మకంతో తుని, పాడేరు వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా గర్భిణీలు ప్రసవాల కోసం ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. డెలివరీ సమయంలో చివరి నిమిషంలో ఆసుపత్రికి రావడం వల్ల తలెత్తుతున్న సమస్యలను నివారించేందుకు ఈ ప్రసూతి నిరీక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గర్భిణీలు డెలివరీ తేదీకి రెండు రోజుల ముందే ఆసుపత్రికి వచ్చి వైద్యుల పర్యవేక్షణలో ఉండేలా ఈ భవనాన్ని డిజైన్ చేసినట్లు



తెలిపారు. గర్భిణితో పాటు ఒక సహాయకురాలికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చొరవతో డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద రూ.2.10 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని స్పీకర్ ప్రశంసించారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ఎన్టీపీసీ సంస్థ రూ.72.5 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. దీంతో ఆయా ఆసుపత్రుల్లో మౌళిక వసతులు మరింత మెరుగుపడతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 7 టిఫా స్కానింగ్ మిషన్లను మాత్రమే ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో ఒకటి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి రావడం గర్వకారణమని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి, లోపాలను ముందుగానే గుర్తించేందుకు ఈ మిషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ కె.వి.ఎల్.పి రాజు, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జడ్పిటిసి రమణమ్మ, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్య చంద్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ కృష్ణారావు (ఇంచార్జ్ డిసిహెచ్ఓ), ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, ఆసుపత్రి సిబ్బంది, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి రోగులకు ఆహార భరోసా

### ఉచిత భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**సూళ్లూరుపేట:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు నిజంగా వరంగా మారిన ఉచిత భోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు. పేద ప్రజలపై చికిత్స సమయంలో పడే ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అత్యంత పటిష్టంగా అమలు చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అడ్మిట్ అయిన ఇన్‌పేషెంట్లకు రోజుకు మూడు పూటలా నాణ్యమైన భోజనం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవం అయిన బాలింతలకు మూడు రోజుల పాటు ప్రత్యేక పౌష్టికాహారం, భోజన వసతి కల్పిస్తున్నామని వెల్లడించారు.

రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి షుగర్, కిడ్నీ సమస్యలు లేదా శస్త్రచికిత్స అనంతరం ఉన్నవారికి వైద్యుల సూచనల మేరకు ప్రత్యేక డైట్ మెనూ అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో రోగులు, వారి సహాయకులు భోజన ఖర్చుల విషయంలో ఇబ్బంది పడకుండా చూడడమే కాకుండా, పౌష్టికాహారం ద్వారా వారు త్వరగా కోలుకునేలా చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. అలాగే ఆసుపత్రుల్లో వడ్డించే భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, మెనూ ప్రకారం సమయానికి ఆహారం అందేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఈ సౌకర్యాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డయాలసిస్ కేంద్రానికి సన్నాహాలు నియోజకవర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. చెన్నై, తిరుపతి, నెల్లూరు వంటి ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన పరికరాలు, వైద్య బృందాలను త్వరలో సమకూరుస్తామని ఆమె పేర్కొన్నారు. "ఆరోగ్యవంతమైన సూళ్లూరుపేట నిర్మాణమే మన అందరి లక్ష్యం" అని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉచిత భోజన పథకం కాంట్రాక్టర్ శివయ్య నాయుడు, సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ డాక్టర్ రమేష్, గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ సభ్యులు హనుమంత రావు, సతీష్, సరిత, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం దృఢ సంకల్పం



**సూళ్లూరుపేట:** రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన పాలనా తప్పిదాల వల్ల నేడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి తరచూ స్పష్టం చేస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, భూ వివాదాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూ రిజిస్ట్రేషన్లలో జరిగిన అక్రమాలే ఇందుకు ప్రధాన కారణమని వారు ఆరోపించారు. ఒకరి పేరులో ఉన్న భూమిని మరొకరి పేరులో నమోదు చేయడం, సర్వే నంబర్లు మార్చడం, వారసత్వ భూములను తప్పుగా రిజిస్టర్ చేయడం వంటి చర్యల వల్ల ఇప్పటికీ ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా సమస్యలు కొనసాగుతున్నాయంటే, గత పాలనలో జరిగిన అన్యాయాల ప్రభావమేనని వ్యాఖ్యానించారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి మండలానికి రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామని చెప్పారు. అలాగే నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీలకు కూడా రూ.2 కోట్ల చొప్పున నిధులు కేటాయించి, రోడ్లు లేని ప్రాంతాల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. డ్రైనేజీ సమస్యల కారణంగా చెత్త పేరుకుపోయి, దోమలు పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.16 కోట్లు, నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.18 కోట్లు డ్రైనేజీ పనుల కోసం మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని, త్వరలోనే డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో రాజకీయ కారణాలతో పేదల పెన్షన్లు రద్దు చేసిన పరిస్థితులు ఉన్నాయని, కానీ ప్రస్తుతం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలను ఇబ్బంది పెట్టవద్దని ముఖ్యమంత్రి కఠిన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఎవరికి ఓటు వేశారు, ఏ పార్టీకి చెందినవారు అన్నది పక్కనపెట్టి అర్జీలను స్వీకరిస్తున్నామని, సీఎంఆర్ఎఫ్, ఇళ్లు, పెన్షన్లు వంటి అంశాల్లో రాజకీయ భేదాభిప్రాయాలకు తావు లేదని నాయకులు స్పష్టం చేశారు. పేదలకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో రాజకీయ గుర్తింపుల పేరుతో సంక్షేమ పథకాలు రద్దు చేసిన దుస్థితిని ప్రజలు చూశారని, అయితే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇక అలాంటి పరిస్థితులకు చోటు లేదని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అదే నిబద్ధతతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పీపీపీతో నిర్మించడం ప్రజలకు నష్టం

### విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



**నర్సీపట్నం:** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని, విద్యా, వైద్య సేవలు ప్రజలకు అందించడం ప్రభుత్వం యొక్క కనీస బాధ్యత అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి విశాఖపట్నంలో పరిశ్రమల సదస్సులు నిర్వహిస్తున్నదని, వాటి వల్ల ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఉపాధి కలిగిందా అని ప్రశ్నించారు. ఆ ఖర్చుతోనే నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేయవచ్చని అన్నారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఇప్పటివరకు ఒక్కరే ముందుకు వచ్చారని తెలిపారు. కిమ్స్ యాజమాన్యం కూడా తాము టెండర్ వేయలేదని ఒక వ్యక్తిగత డాక్టర్ వేశారని ప్రకటించడం, చంద్రబాబు ప్రభుత్వంపై కార్పొరేట్ సంస్థలకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తుందని విమర్శించారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సేవలను ప్రభుత్వం గాలికి వదిలేసి, కార్పొరేట్లు, పరిశ్రమాధిపతులకు సేవలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం తలమునకలై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రత్యక్ష భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, అల్లు రాజు, ఈరెల్లి చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్. గౌరి, కె.వి. సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



**మోపిదేవి:** ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అవనిగడ్డ డిఎస్పి తాళ్లూరి విద్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని కాసానగరం గ్రామం వద్ద ప్రధాన జాతీయ రహదారిపై శనివారం ద్విచక్ర వాహనదారులకు చల్లపల్లి సిఐ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారికి ఆపి వారికి డి.ఎస్.పి విద్యశ్రీ.. హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకపోవడంతో వారికి జరిమానా విధించకుండా, వారి చేత హెల్మెట్లు కొనుగోలు చేయించారు. ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వలన తలకు గాయాలై పలువురు మృతి చెందినట్లు తెలిపారు. వాహనదారులకు ఫైన్స్ వేయడం తమ ఉద్దేశం కాదు. వారి రక్షణ తమ బాధ్యత అని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని చల్లపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో హెల్మెట్ వాడకం పెంచడానికి నూతన విధానాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. హెల్మెట్ లేనివారికి జరిమానా విధించడం జరుగుతుందనీ, లేని పక్షంలో దగ్గరలోని షాపులో హెల్మెట్ కొనుగోలు చేసి ధరిస్తే, జరిమానా విధించకుండా వదిలేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు వెంకట్రామ్ సహాయం



**చల్లపల్లి:** మండలంలో లక్ష్మీపురం శివారు రామానగరంలో అగ్ని ప్రమాద బాధితులను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. తోటవారిబజారులో నివసిస్తున్న వెలగం అనురాధకు చెందిన పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. శనివారం ఆమెను వెంకట్రామ్ పరామర్శించి గ్రామీణ యువజన వికాస సమితి ద్వారా తనవంతు సహాయంగా దుప్పట్లు, దుస్తులు అందచేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన మేరకు గృహనిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వ అధికారులు నూతన గృహం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండల జనసేన పార్టీ నాయకుల ద్వారా రూ.పది వేలు ఆర్థిక సహాయాన్ని, బీజేపీ మండల అధ్యక్షుడు అడపా రవి 25కిలోల బియ్యంలను వెంకట్రామ్ చేతులమీదుగా అనురాధకు అందచేశారు. ప్రముఖ న్యాయవాది తుటారం ప్రసాద్ రూ.వెయ్యి సహాయం అందచేశారు. భర్త చనిపోయిన తరువాత ఆర్థిక పరిస్థితి దెబ్బతిని తన ఇద్దరు కుమార్తెల చదువుకు ఇబ్బంది పడుతున్నామని అనురాధ చెప్పింది. పెద్ద కుమార్తె డిగ్రీ ఆపేయగా, రెండో కుమార్తె చదువుకు సైతం ఇబ్బంది పడుతున్నట్లు చెప్పింది. అనురాధ కష్టాన్ని, ఆవేదనను విన్న వెంకట్రామ్ చదువు ఆపవద్దని అనురాధ కుమార్తెలకు సూచించారు. విద్యాభ్యాసం కోసం దాతల సహాయం సమకూర్చుతామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చల్లపల్లి చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, కూటమి నాయకులు రావి రాజేశ్వరరావు (రాజు), నల్లమోతు వీరయ్య, గోళ్ళ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకా తిరుమలలో నృత్య ప్రదర్శన



### శ్రీ గజముఖ నృత్య అకాడమీ కళాకారుల మనోహర అభినయం



**ద్వారకాతిరుమల:** శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలో శ్రీ గజముఖ నృత్య అకాడమీ (నర్సీపట్నం) నిర్వహించిన క్లాసికల్ నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధనంమాస్టారి ఆధ్వర్యంలో జరిగిన ఈ నృత్య ప్రదర్శన భక్తి, కళా సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది. భారతీయ సంప్రదాయ నృత్య రూపాలను ఆధారంగా చేసుకుని కళాకారులు చేసిన అభినయం, హావభావాలు, లయాత్మక కదలికలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా శాస్త్రీయ నృత్యానికి సంబంధించిన భక్తిరస గీతాలపై ప్రదర్శించిన నృత్యాలు ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపాయి. ఈ కార్యక్రమం ద్వారా యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యమని అకాడమీ నిర్వాహకులు తెలిపారు. కళల పరిరక్షణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని ధనంమాస్టారు (నర్సీపట్నం) తెలిపారు. ఈ నృత్య ప్రదర్శనను వీక్షించిన భక్తులు, కళా ప్రియులు అకాడమీ కళాకారులను అభినందించారు.